గజ..గజ...

- కనిష్టానికి పగటి ఉష్ణోగ్రతలు - గతేడాదితో పోలిస్తే మరింత క్షీణత

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

జిల్లా ప్రజలను చలి గజ గజ వణికిస్తోంది. పగటి ఉష్ణోగ్రతలు కనిష్టానికి పడిపోయాయి. గతేడాదితో పోలిస్తే ఉష్ణోగ్రతలు మరింత క్షీణించడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. చలి పెరుగుతున్న నేపథ్యంలో జాగ్రత్తలు తప్పవని వైద్యులు సూచిస్తున్నారు...

కర్నూలు జిల్లాలో చలి పంజా విసురుతోంది. పగటి ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పడిపోతున్నాయి. చలి తీవ్రత పెరిగింది. రెండ్రోజుల కిందట రాత్రివేళల్లోనే చలి ఎక్కువగా ఉన్నప్పటికీ ప్రస్తుతం ఉదయం కూడా ప్రభావం చూపుతోంది. రాత్రి 9 నుంచి ఉదయం 8 గంటల వరకు బయటికి రావాలంటే ప్రజలు గజగజ వణికిపోతున్నారు. తెల్లవారుజాము నుంచి రోడ్లను మంచు కప్పివేస్తోంది. జిల్లాలో సోమవారం తెల్లవారుజామున మంత్రాలయంలో 6 డిగ్రీల సెంటిగ్రేట్, కర్నూలు రూరల్‌లో 6.6 డిగ్రీలు, ఆదోనిలో 6.9 డిగ్రీలు, బనవాసిలో 7.2 డిగ్రీల సెంటిగ్రేడ్ కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇప్పటి వరకూ ఎన్నడూ లేనంతగా పగటి ఉష్ణోగ్రతలు పడిపోయాయి. ఆదివారం, సోమవారం ఉదయాల్లో ఆలూరులో 12 డిగ్రీలు, కర్నూలు, ఎమ్మిగనూరులో 14 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గతేడాది ఇదే సమయానికి 17 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదయింది. గతేడాదితో పోలిస్తే 3 నుంచి 5 డిగ్రీల వరకూ ఉష్ణోగ్రత తగ్గడంతో జిల్లా వాసులను చలి గజ గజ లాడిస్తోంది.

చలిలో తిరిగితే అనారోగ్యమే

రాత్రి ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోతుండటంతో ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారు. చలిలో ఎక్కువగా తిరిగితే జలుబు, జ్వరం, దగ్గు వంటి వ్యాధులు సంక్రమిస్తున్నాయని వైద్యులు చెబుతున్నారు చలిలో బయటకు వెళ్లాల్సి వచ్చినప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెబుతున్నారు. చలి ఎక్కువగా ఉన్న సమయంలో కొంత వేడి పదార్థాలు తీసుకోవటం వల్ల ఉపశమనం కలుగుతుందని చెబుతున్నారు. రాత్రి సమయాల్లో చలి తీవ్రత ఎక్కువగా ఉన్నప్పుడు ఇంటి వద్దే ఉంటే మంచిదని చెబుతున్నారు. పిల్లలు, వృద్ధులు, ఆస్తమా, గుండె సంబంధ వ్యాధులు ఉన్న వాళ్లు మరింత జాగ్రత్తగా ఉండాలని హెచ్చరిస్తున్నారు. చలితో పాటు తెల్లవారుజామున మంచు ఎక్కువుగా ఉంటోంది. మంచులో రహదారులపై ఎదురుగా వచ్చే వాహనాలు కనబడక ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. వాకింగ్ చేసే వారికి ఇబ్బందులు తప్పడం లేదు. చలి పెరుగుతుండటంతో ఉన్ని దుస్తులకు గిరాకీ పెరిగింది. జిల్లాలోని అన్ని పట్టణాలు, మండల కేంద్రాల్లోను ఉన్ని దుస్తుల దుకాణాలు వెలిశాయి. నేపాల్‌కి చెందిన వారు ఎక్కువగా బహిరంగ ప్రదేశాల్లో టెంట్లు వేసి ఉన్ని దుస్తుల అమ్మకాలు చేస్తున్నారు. ప్రజలు చలి తీవ్రతను తట్టుకునేందుకు స్వెటర్లు, మంకీ క్యాప్‌లను కొనుగోలు చేస్తున్నారు. రానున్న రోజుల్లో చలి తీవ్రత మరింత పెరగనున్నదని వాతావరణ శాఖ అధికారులు వెల్లడిస్తున్నారు.

స్పందన హాజరు నివేదిక పంపాలి

- కలెక్టర్ కోటేశ్వరరావు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

స్పందనలో వచ్చిన ప్రతి దరఖాస్తును జాగ్రత్తగా పరిశీలించి, నాణ్యతతో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు అధికారులను ఆదేశించారు. ప్రతి సోమవారం జరిగే స్పందన కార్యక్రమం హాజరు నివేదిక సాయంత్రంలోగా పంపాలని అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని సునయన ఆడిటోరియంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ రామ సుందర్ రెడ్డితో పాటు జిల్లా అధికారులు, మండలాల్లో మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు..అర్జీల స్వీకరణ అనంతరం కలెక్టర్ స్పందన అర్జీల పరిష్కారం, ఇతర అంశాలపై జిల్లా అధికారులతో నేరుగాను, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ .. గ్రామ, వార్డ్ సచివాలయాల్లో మధ్యాహ్నం 3 గంటల నుండి 5 గంటల వరకు స్పందన కార్యక్రమాన్ని కచ్చితంగా నిర్వహించాలని ఆదేశించారు. దరఖాస్తులు రీ ఓపెన్ అయ్యాయని, ఒక్క దరఖాస్తు కూడా రీ ఓపెన్ కాకూడదని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.. ఆర్థిక అంశాలకు సంబంధించిన దరఖాస్తులు అయితే ఆ విషయాన్ని తెలియచేసే ఆప్షన్‌ను ఉపయోగించుకోవాలని సూచించారు..సమస్య పరిష్కారానికి సంబంధించిన ఫోటోను స్పందన పోర్టల్ లో కచ్చితంగా అప్లోడ్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు..

ఉత్తమ డాక్టర్లకు అభినందన

రాష్ట్ర ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని అమలు చేస్తూ ఉత్తమ సేవలు అందించిన డాక్టర్లను సోమవారం జిల్లా కలెక్టర్ కోటేశ్వరరావు అభినందించారు. జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్ సుందర్ రెడ్డి ప్రశంసా పత్రాలు అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ అక్టోబర్ నెల 21 నుండి ఫ్యామిలీ డాక్టర్స్ కాన్సెప్ట్ అమల్లోకి వచ్చిందన్నారు.. ముఖ్యంగా జిల్లాలో నెలకు రెండు పర్యాయాలు 104 వాహనం ద్వారా డాక్టర్లు ప్రజల దగ్గరికి చేరుకొని గ్రామంలో ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయాలు అందించి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఉత్తమ సేవలందించిన గార్గేయపురం పిహెచ్‌సి డాక్టర్ హేమలత, హుస్సేనాపురం డాక్టర్ అమర్నాథరెడ్డి, కల్లూరు డాక్టర్ ఎస్. శైలజ కుమార్, పోలకల్లు డాక్టర్ హరిశ్చంద్రుడు, తుగ్గలి డాక్టర్ ద్రాక్షాయిని, కమ్మరిచేడు డాక్టర్ సుమితలు ఆయా పిహెచ్‌సిల పరిధిలో డిసెంబర్ నెలలో ఉత్తమ సేవలు అందించినందుకు కలెక్టర్ ప్రశంసాపత్రాలు అందించారు. జిల్లా వైద్యాధికారి రామ గిడ్డయ్య, ఫ్యామిలీ ఫిజీషియన్ జిల్లా నోడల్ అధికారి డాక్టర్ మురళి, డిపిఎంఒలు సుబ్రహ్మణ్యం, ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలందించిన డాక్టర్లను అభినందిస్తున్న కలెక్టర్ పి.కోటేశ్వరరావు, జెసి రామసుందర్‌రెడ్డి

కళాకారులను సన్మానిస్తున్న మేయర్ బివై.రామయ్య

బాలలకు వినోదం లవకుశ

ప్రజాశక్తి - కర్నూలు కల్చరల్

ఒకనాడు వెలుగు వెలిగిన సురభి నాటకాలు తెలుగు నాట కాలక్రమేనా వచ్చిన మార్పులతో ఆదరణ కోల్పోయామని కర్నూలు నగర మేయర్ బివై.రామయ్య అన్నారు. సోమవారం రాత్రి కర్నూలు టిజివి కళాక్షేత్రంలో సురభి నాటకాల్లో భాగంగా రెండవరోజు భానోదయ సురభినాట్యమండలి కళాకారులు 'లవకుశ' నాటకాన్ని ప్రదర్శించారు. జ్యోతి వెలిగించిన నగరమేయర్ బివై.రామయ్య నాట్యమండలి కళాకారులను సత్కరించారు. నిర్వాహకుడు శివశంకర్ మాట్లాతూ లలితకళా క్షేత్రంలో చక్కని కార్యక్రమాలు చేస్తున్నారని అభినందించారు. పెద్ద ఎత్తువ ప్రేక్షకులు తరలిరావడం చూస్తుంటే ఆగరణ తగ్గ లేదని నిరూపించారన్నారు. సురభి కళా కారులను ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. సభలో వీరశైవ లింగాయత డైరెక్టర్ గోపాల్ రెడ్డి, కళాక్షేత్రం అధ్యక్ష, కార్యదర్శులు పతిఓబులయ్య మహమ్మద్ మియా, కన్వీనర్ కె.బాల వెంకటేశ్వర్లు, రత్నం, తదితరులు పాల్గొన్నారు. శ్రీరామ పట్టాభి షేకం, రాక్షసమాయలు, పక్షుల విహారం, బాణాలకు యుద్ధం, లవకుశుల ఆశ్రమం విద్యాభ్యాసం వంటి ఘట్టాలు చక్కగా ఆకట్టకున్నాయి.

ఆంక్షలతో పించన్లు కట్

- అవ్వ, తాతల గుండెల్లో గుబులు - పించన్లు రాకపోతే ఆత్మహత్యలే శరణ్యం
- నగరంలో 3085 మందికి నోటీసులు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

అవ్వ ,తాతలు, వితంతువులు, వికలాంగుల పించన్లను ప్రభుత్వం వివిధ ఆంక్షలతో రద్దు చేయడంతో అవ్వ తాతలకు పెరిగి రావాల్సిన పెన్షన్ రాకపోవడంతో వారి గుండెల్లో గుబులు పుట్టింది. అలాగే వికలాంగుల పింఛన్ రాకపోతే తాము ఏ పని చేయలేమని, ఆత్మహత్యలే శరణమని అంటున్నారు. ఇలా కర్నూలు నగరంలో వివిధ రకాల పెన్షన్ దారులకు రకరకాల కారణాలు చూపుతూ 3085 మంది లబ్ధిదారులకు నగరపాలక సంస్థ నుండి నోటీసులు జారీ చేశారు. కర్నూలు నగరంలో 52 వార్డులలో 133 సచివాలయాల్లో మొత్తం 3,085 మందికి కింది కారణాల చేత నోటీసులు జారీ చేశారు. అవి ప్రధానంగా 1000 చదరపు అడుగులు నివాస స్థలం ఉండటం. ప్రభుత్వ పింఛన్‌తో పాటు ప్రభుత్వ ఉద్యోగము ఉండడం, కారు (ఫోర్ వీలర్) ఉన్నవారు, జిఎస్‌టి కడుతున్న వారు ,ఇన్కమ్ టాక్స్ చెల్లించేవారు పెన్షన్లకు అనర్హులుగా భావించి వారి పెన్షన్లను ప్రభుత్వం రద్దు చేస్తూ నోటీసులు జారీ చేశారు. ఇంతకాలంగా పెన్షన్లు తీసుకుంటూ ఉండి అకస్మాత్తుగా నూతన సంవత్సరంలో పెన్షన్ రాకపోయేసరికి మా భవిష్యత్తు ఏమిటి ఇంట్లో తిండి కూడా పెట్టరు అనే బెంగ వృద్ధులలోపట్టుకుంది. ఇక వికలాంగులకు ప్రభుత్వం ఇచ్చిన స్థలాల్లో గుడిసె వేసుకొని జీవనం సాగిస్తున్న వారికి కూడా పెన్షన్ తొలగించడం పట్ల తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. ఏ పని చేతకాని మాకు పెన్షన్ రద్దు చేస్తే ఆత్మహత్యలే శరణ్యమని చెబుతున్నారు. ప్రభుత్వం పునరాలోచించి వెంటనే పెన్షన్లను పరిశీలించి పునరుద్ధరించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

ఆత్మహత్యలే శరణ్యం

- వికలాంగుడు కె.నరేష్, చల్లావారి వీధి

గత ప్రభుత్వం స్థలం ఇచ్చింది. అందులో కొట్టం వేసుకొని ప్రభుత్వం ఇచ్చే పింఛన్‌తో జీవనం గడుపుతున్నాను. నాకు ఏ పని చేతకాదు. పింఛన్ రాకపోతే రోడ్డుపై మందు తాగి ఆత్మహత్య చేసుకోవాల్సి వస్తుంది.

మూడు నెలలుగా పింఛన్ రావడం లేదు

- మూగ షబ్బీర్, గరీబ్ నగర్

తల్లి కుమారులం ఇద్దరం చిన్నపాటి గుడిసె వేసుకొని షబ్బీర్‌కు వచ్చే పింఛన్‌తో జీవనం గడుపుతున్నాం. నా కుమారునికి ఏ పని చేతకాదు పెన్షన్ మీదనే ఆధారపడి జీవిస్తున్నాం. అని తల్లి మహబూబ్‌బీ చెప్పింది. పెన్షన్ ఇప్పించి ఆదుకోవాలి.

ఇల్లు ఉందని

-పి.రంగమ్మ, నరసింహారెడ్డి నగర్

తనకు గడియారం ఆసుపత్రి వద్ద ఇల్లు ఉందని పింఛను తొలగించారు. ఇండ్లలో పాచి పని చేసుకుని బతుకుతున్న పెన్షన్ లేకపోతే కొడుకులు తిండి కూడా పెట్టరు.

కూలీల సమస్యల పరిష్కారానికి ఉద్యమం

- వ్యకాస జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా వీరశేఖర్, నారాయణ

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్

వ్యవసాయ కూలీలు, కార్మికుల సమస్యల పరిష్కారానికి ఉద్యమం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం కర్నూలు జిల్లా 12 మహాసభ తీర్మానం చేసిందని నూతనంగా ఎన్నికయిన ప్రధాన కార్యదర్శి కెవి.నారాయణ ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా 12వ మహాసభలు కోడుమురులో ఈనెల 7, 8 తేదీలతో నిర్వహించామని తెలిపారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా బి.వీరశేఖర్, ప్రధాన కార్యదర్శిగా కెవి.నారాయణకు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఉపాధ్యక్షులుగా కె.లింగన్న, కె.వెంకటరాముడు, ఇ.తిక్కన్న, డి.రామాంజనేయులు, సహాయ కార్యదర్శులుగా బి.బాలకృష్ణ, ఎస్.తిమ్మన్న, పి.సురేంద్ర, బి.నాగన్న, ఆఫీస్ బేరర్స్‌గా, మిగిలిన వారు జిల్లా కమిటీ గా వున్నారు. మొత్తం 36 మందితో జిల్లాకమిటీని ఆమోదించినట్లు తెలిపారు.

తీర్మానాలు: జగనన్న కాలనీల నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని, వ్యవసాయ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, వలసలు ఆపాలని, ఉపాధిహామీ పనులు కల్పించి, 200 రోజులు పనులు చూపి, రోజుకు రూ.600 వేతనం ఇవ్వాలన్నారు. కోనేరు రంగారావు సిపార్సు ప్రకారం ప్రతిపేద కుటుంబానికి రెండెకరాల ఎకరాల భూములు ఇవ్వాలన్నారు. 60 యేళ్ళ దాటిన వ్యవసాయ కూలీలకు రూ.5000 వేలు పింఛన్ ఇవ్వాలని తదితర తీర్మానాలను మహాసభ ఆమోదించింది.

వ్యకాస జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా వీరశేఖర్, నారాయణ

నాయకులకు సమస్యలు కనపడవా?

ఓట్ల సమయంలోనే ప్రజలు కనిపిస్తారా?

ప్రజాశక్తి-కర్నూల్ కార్పొరేషన్

ఓట్ల సమయంలోనే ప్రజలు కనిపిస్తారా మిగతా సమయంలో సమస్యలు పట్టకుండా వ్యవహరిస్తారని సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు నరసింహులు విమర్శించారు. సోమవారం బిటిఆర్ నగర్‌లో పర్యటించిన సిపిఎం బందం నిరుపయోగంగా పనిచేయకుండా ఉన్న కొళాయిలను పరిశీలించారు. 10 కొళాయిలు పనిచేయకుండా చెడిపోయిన పాలకులు పట్టించు కోకపోవడం చాలా అన్యాయమన్నారు. ఓట్లు వచ్చినసమయంలోనే అధికార పార్టీ నాయకులకు ప్రజలు గుర్తొస్తారా, ఇన్ని కుళాయిలు చెడిపోయినా వారికి కనపడదా అని ప్రశ్నించారు. సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్. నరసింహులు, వార్డు కార్యదర్శి బి.రాధాకృష్ణ, ఐద్వా నాయకురాలు ఇఎల్ఎస్.రత్నమ్మ, వార్డు నాయకులు ఎన్. శివకృష్ణ , చంద్ర తదితరులు పాల్గొన్నారు.

స్పందన ద్వారా సమస్యలు పరిష్కారం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగర ప్రజల సమస్యలు పరిష్కారం కోసమే స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నామని వెంటనే సమస్యలు పరిష్కారం చేసే విధంగా చర్యలు తీసుకుంటామని అదనపు కమిషనర్ పివి. రామలింగేశ్వర్ అన్నారు. కర్నూలు మున్సిపల్ హాలులో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో ప్రధానంగా గీతా నగర్ వాసులు జగదీశ్ , తమ వీధిలో సరయిన రోడ్డు , డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేనందువలన పందులు , కుక్కల బెడద ఎక్కువగా ఉన్నదని, వాటివలన కాలనీ వాసులు ఇబ్బంది పడుతున్నారని, అందువలన త్వరగా ఈ సమస్యను పరిష్కరించాలని కమిషనర్‌ను కోరారు. శ్రీశైలం దేవస్థానం ఎంప్లాయిస్ కాలనీకి చెందిన శ్రవణ్ కుమార్ , ఇతరులు , తమ ప్లాట్లకు ఉత్తర దిక్కున ఉన్న కొన్ని కాలనీలకు సరయిన డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవటం చేత తమ ఖాళీ ప్లాట్లలో ప్రవేశించి, అక్కడే నిలిచిపోయి, అనారోగ్యానికి దారి తీస్తుందన్నారు. సమస్యను పరిష్కరించాలని అభ్యర్ధించారు. రిచ్మండ్ విల్లాస్ కాలనీవాసి అయిన ప్రకాష్ బాబు , ఇతరులు, మురుగు నీటిని సేకరించే ఉద్దేశ్యంతో అధికారులు పలు కాలనీలను అనుసంధానం చేస్తూ ఇప్పుడు పెద్ద కాలువను నిర్మించనున్నారని, దాని నిర్వహణ శ్రమతో కూడుకున్నదని, పైగా అంతటి పెద్ద కాలువ వలన ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉన్నందున, ప్రత్యామ్నాయ డిజైన్ కొరకు ఒకసారి పునఃపరి శీలించాలని కోరారు. ఇలా అనేక సమస్యలతో కూడిన వినతిపత్రాలను స్పందన కార్యక్రమంలో అందించారు. స్పందన కార్యక్రమంలో కర్నూలు నగర పాలక సంస్థ అదనపు కమిషనరు పివి. రామలింగేశ్వర్ , డిప్యూటీ కమిషనర్ ఎస్‌వి. రమాదేవి , సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, మేనేజర్ చిన్నరాముడు, ఆర్ఒ జునీద్ , హెల్త్ సూపరింటెండెంట్ సుబ్బన్న , ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ హాస్టళ్ల సమస్యలను పరిష్కరించండి

ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిరాహార దీక్ష

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

దీక్షలను ప్రారంభిస్తున్న సిపిఐ నాయకులు రసూల్

ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని విద్యార్థి యువజన ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఎఐఎస్ఎఫ్ కర్నూలు జిల్లా సమితి ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు డి సోమన్న అధ్యక్షతన ధర్నా చౌక్‌లో తలపెట్టిన నిరాహార దీక్షను సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ఎన్.రసూల్, జిల్లా కార్యవర్గ సభ్యులు కె.జగన్నాథం, పి.రామకృష్ణారెడ్డి నాయకులకు పూలమాలలు వేసి ప్రారంభించారు. ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.సోమన్న, ఇ.శ్రీరాములు గౌడ్ లు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా వసతి గహాల సమస్యలకు నిలయాలుగా మారాయని అన్నారు. జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి రాకముందు అధికారంలోకి వచ్చిన వెంటనే సంక్షేమ వసతి గృహాల్లో సన్న బియ్యాన్ని పంపిణీ చేస్తామని, వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలన్ని పరిష్కరిస్తామని, వసతి గృహ విద్యార్థులకు తోడుంటామని, హక్కున చేర్చుకుంటామని అనేక మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన జగన్మోహన్ రెడ్డి విద్యార్థులను నట్టేట ముంచారన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనేక వసతి గృహాల్లో విద్యార్థినిలు బాత్రూంలకు తలుపులు కరువై, బెడ్ సీట్లను అడ్డం పెట్టుకొని కాలకృత్యాలు తీర్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. వసతిగహాల్లో వార్డెన్, కుక్, కమాటి, వాచ్ మెన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని వాటిని వాటిని భర్తీ చేయకపోవడం దారుణమన్నారు. వసతి గృహాలకు సొంత భవనాలు లేక అద్దె భవనాల్లో నడుపుతూ, అద్దెలు చెల్లించలేక అనేక అవస్థలు పడుతున్నారని అన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్, కాస్మోటిక్ చార్జీలను పెంచాలని, నాడు నేడు ద్వారా వసతి గృహాలకు సొంతభవనాలు కేటాయించాలన్నారు. లేనిపక్షంలో విద్యార్థులను ఐక్యం చేసి చలో కలెక్టరేట్‌లు, చలో విజయవాడ నిర్వహిస్తామని హెచ్చరించారు. ఎఐఎస్ఎఫ్ దీక్షలకు పలు విద్యార్థి, యువజన, ప్రజాసంఘాలు సంఘీభావం తెలిపాయి.

శరవేగంగా విస్తరించనున్న కర్నూలు నగరం

కర్నూలు కార్పొరేషన్: ప్రస్తుత కర్నూలు నగర జనాభా 7,25,000 రానున్న రెండేళ్లలో 8 లక్షలకు చేరుకోనుందని, దానికి అనుగుణంగా పనులు వేగంగా జరుగుతున్నట్లు నగరమేయర్ బి వై.రామయ్య సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కర్నూలు నగరాన్ని పర్యాటకులను ఆకర్షించే విధంగా నగరంలో కూడా పనులను చేస్తున్నామని తెలిపారు. దీంతో నగరం విస్తరించనుందని తెలిపారు.

జగనన్న ఇళ్లకు బిల్లులు సక్రమంగా అందించాలి : డిఇ

ప్రజాశక్తి- సి బెళగల్ : జగనన్న ఇళ్లకు బిల్లులు సక్రమంగా అందించాలని హౌసింగ్ డిఇ వాసుదేవరాయలు హౌసింగ్ అధికారులకు, సిబ్బందికి పేర్కొన్నారు. సోమవారం బెళగల్ లోని హౌసింగ్ కార్యాలయాన్ని తనిఖీ చేసి జగనన్న ఇళ్ళు రికార్డులను పరిశీలించారు. మండలంలో 180 ఇళ్ళు రూఫ్ లెవల్‌లో ఉండగా బిల్లులు అందడం లేదన్న అపోహ లబ్ధిదారులలో రాకుండా చూసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎఇ సుమంత్, సిబ్బంది రంగన్న, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

అంతరాలు లేని సమాజం కోసం ఉద్యమం

ఫాతిమా షేక్ 192వ జయంతి సందర్భంగా కెవిపియస్ క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్ : పాతిమా షేక్ స్ఫూర్తితో అంతరాలు సమాజం కోసం సామాజికి ఉద్యమాలను ముందుకు తీసుకుపోవాలని కెవిపిఎస్ఐ ,సిఐటియు నాయకులు పిలుపునిచ్చారు. కెవిపిఎస్ జిల్లా కమిటి ఆధ్వర్యంలో సోమవారం కర్నూలు కార్మిక కర్షక భవన్‌లో మహనీయులు ఫాతిమా షేక్ 192వ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫాతిమా షేక్ చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కెవిపిఎస్ 2023 క్యాలెండర్‌ను ఇవిష్కరించారు. కెవిపిఎస్ జిల్లా సహాయ కార్యదర్శి ఆర్ పెద్దబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు గౌస్ దేశాయి, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.ఆనంద్‌బాబు, కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు పిఎస్. రాధాకృష్ణ, కెవిపిఎస్ నంద్యాల జిల్లా అధ్యక్షులు కె.రంగన్న మాట్లాడారు. వారు మాట్లాడుతూ మహిళలకు ఎలాంటి గౌరవం లేని సమాజంలో 180 యేళ్ల క్రితం తాను చదువు నేర్చుకుని కుల, మతాలకతీతంగా పూలే దంపతులకు తోడుగా అనగారిన వర్గాలకు విద్యనందించిన గొప్ప మహిళ ఫాతీమా షేక్ అని కొనియాడారు. క్యాలెండర్‌లో మహనీయుల చిత్రాలతో పాటు వారు చేసిన పోరాటాలను సైతం గుర్తించేలా పొందుపరిచామన్నారు. కులాల కుంపట్లతో కొట్టుమిట్టాడుతున్న భారత సమాజాన్ని ఎస్‌సి, ఎస్‌టి, బిసి , ఒసి ,మైనారిటీ అనే తరగతులుగా విభజించి ఎవరిని ఎందులో చేర్చాలో అనే బాధ్యతను ప్రభుత్వాలకే అప్పజెప్పిన మహనీయుడు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ పైన కొంతమంది జ్ఞానం లేని వ్యక్తులు అవాకులు చవాకులు పేలుతున్నారన్నారు. అలాంటి వారి పైన కఠినమైన చర్యలు తీసుకోవాలన్నారు. పోరాడి సాధించుకున్న ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ వచ్చిన ప్రభుత్వం దాన్ని కొనసాగిస్తుందో లేదో కూడా మాట్లాడడం లేదన్నారు. కెవిపిఎస్ నాయకులు డి.విజయమ్మ, ఎన్‌జి.కృష్ణ, బి.తిక్కప్ప, తదితరులు పాల్గొన్నారు.

ఫాతిమా షేక్ నివాళ్లు అర్పిస్తున్న కెవిపిఎస్ నాయకులు

జగనన్నది సడలని సంకల్పం

దేశ చరిత్రలో మైలురాయి సంకల్పయాత్ర- ఎమ్మెల్యే డాక్టర్ జె.సుధాకర్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ జె.సుధాకర్

సడలని సంకల్పానికి ప్రతిరూపం జగనన్న అని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అన్నారు. సోమవారం కర్నూలు స్టాంటన్ పురంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పాదయాత్ర ద్వారా వైఎస్ జగన్ ప్రతిఒక్కరిని కలిసి నవరత్నాలు తీసుకొచ్చారన్నారు. దేశ చరిత్రలో సంక్షేమ క్యాలెండర్ విడుదల చేసిన గొప్ప నాయకుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని అన్నారు. ప్రజల్లో ధైర్యంగా వెళుతున్నామంటే వైఎస్ జగన్ ప్రవేశ పెట్టిన పథకాల వల్లే అని చెప్పారు. మరో 30 ఏళ్లు సీఎంగా జగన్మోహన్ రెడ్డి కొనసాగుతారన్నారు. అంతకుముందు ఆయన వైసిపి నాయకులు కార్యకర్తలతో కలిసి 4 ఏళ్ల సంకల్పయాత్ర మహోత్సవ వేడుకల్లో భాగంగా కేకును కట్‌చేసి పంచిపెట్టారు. కర్నూలు ఎంపిపి డి.వాసు వెంకటేశ్వరమ్మ, వైస్ ఎంపిపి నహెమియా జెడ్పిటిసి ప్రసన్నకుమార్ మాజీ వైస్ ఎంపీపీ ధర్మవరం వాసు, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ మహబూబ్ బాషా, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కెడిసిసిబి డైరి, క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఛైర్మన్ మహాలక్ష్మి, సిఇఒ రామాంజనేయులు

కెడిసిసి బ్యాంక్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్ : కెడిసిసిబ్యాంక్ డైరీ, క్యాలెండర్‌ను చైర్మన్ మహాలక్ష్మి, ముఖ్య కార్యనిర్వహణాధికారి పి.రామాంజనేయులు ప్రధాన కార్యాలయంలో సోమవారం ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ రైతాంగానికి విస్తృత సేవలు అందించేలా ప్రతి అభివృద్ధి సూచిస్తూ క్యాలెండర్‌ను రైతులకు డైరీ కూడా ఉపయోగపడేలా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డిజిఎం ఉమామహేశ్వర రెడ్డి, సునీల్ కుమార్, నాగిరెడ్డిలు, బ్యాంక్ అధికారి త్రినాథ్‌రెడ్డి, ఎజిఎంలు , సిబ్బంది పాల్గొన్నారు.

ఈ పంట నమోదుతోనే బీమా వర్తింపు

ప్రజాశక్తి -సి బెళగల్

ఈ పంట నమోదు చేసుకొంటేనే పంటలకు బీమా అవకాశం లభిస్తుందని ఎఒ మల్లేష్ కుమార్ మండలంలోని రైతులకు సూచించారు. సోమవారం సంగాల, పలుకుదొడ్డిలో రైతు భరోసా కేంద్రాలను తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. ఇక్కడే రైతులతో వెళ్లి మొక్కజొన్న, మిరప పంటలను పరిశీలించారు. రబీ సాగులో ఈ పంట చేసుకోవడంలో రైతులు నిర్లక్ష్యం వీడాలని నమోదు చేసుకొని పంటల బీమా పొందాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది వెంకటేశ్వర్లు, సంధ్యారాణి, రైతులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమ పథకాలు పేదలకు వరం

- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు

ప్రజాశక్తి-ఆలూరు

పథకాలను వివరిస్తున్న మంత్రి గుమ్మనూరు

ప్రజా సంక్షేమ పథకాలు పేదలకు వరమని రాష్ట్ర కార్మిక శాఖమంత్రి గుమ్మనూరు జయరాం తెలిపారు. సోమవారం పట్టణంలోని మూడో సచివాలయ ఆవరణలో 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. మంత్రి పాల్గొని ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికే దక్కిందన్నారు. అంతకుముందు సచివాలయ ఉద్యోగులతో సంక్షేమ పథకాలు, సమస్యలపై ఆరా తీశారు. మంత్రి సోదరులు శ్రీనివాసులు, నారాయణ స్వామి, జడ్పిటిసి ఏరూరు శేఖర్, ఎంపిపి శ్రీరాములు, మండల కన్వీనర్ వీరేష్ పాల్గొన్నారు.

'స్పందన'ను వినియోగించుకోండి

- సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమాన్ని ప్రజలు, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమారు సూచించారు. సోమవారం ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందనలో ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. సమస్యలను సమయంలోపు పరిష్కరించేలా అధికారులు కృషి చేయాలని ఆదేశించారు. పరిపాలన అధికారి గోవిందు సింగ్, డిఎల్‌పిఒ నూర్జహాన్, డిప్యూటీ డిఎంహెచ్ఓ సత్యవతి, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణు సూర్య, ఎస్‌డబ్ల్యుఒ సుధాకర్, సీనియర్ సహాయకులు రామయ్య పాల్గొన్నారు.

వైసిపికి ప్రజలు బుద్ధి చెప్పాలి : బీవీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బీవీ

ప్రజలపై భారాలు మోపిన వైసిపి ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పాలని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయ నాగేశ్వర్ రెడ్డి తెలిపారు. సోమవారం టిడిపి ఆధ్వర్యంలో 14వ వార్డులోని సున్నం బట్టి వీధిలో 'ఇదేం ఖర్మ...మన రాష్ట్రానికి' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం చేతకానితనాన్ని కప్పిపుచ్చుకోవడానికి అనేక నిర్బంధాలు విధిస్తోందని విమర్శించారు. ప్రజలపై అనేక భారాలు మోపుతూ, చెత్త, ఇంటి పన్ను పేరుతో పబ్బం గడుపుతోందని తెలిపారు. ప్రజలు వైసిపికి బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. స్థానిక ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి ప్రజా సమస్యలను విస్మరించారని, ఆయన కుమారుడు ఎర్రకోట జగన్మోహన్ రెడ్డిని మాత్రం వసూళ్లకు తిప్పుతున్నారని తెలిపారు. సుందర్ రాజు, దాదా సాహెబ్, తురేగల్ నజీర్ అహ్మద్, ముల్లా కలీముల్లా, రంగస్వామి గౌడ్, మధుబాబు, కొండయ్య చౌదరి, బడే సాబ్, బందే నవాజ్, రామకృష్ణ, మహేష్, ఫరూక్, నరసింహులు పాల్గొన్నారు.

అనాథ పిల్లలకు ఆర్థికసాయం

రూ.1.10 లక్షలు అందజేసిన నూర్ బాషా సంఘం

ప్రజాశక్తి - గోనెగండ్ల

ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు

తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మిగిలిన పిల్లలకు నూర్ బాషా సంఘం తరపున ఆర్థిక సహాయం అందజేసి ఔదార్యాన్ని చాటుకున్నారు. మండలంలోని పెద్దమర్రివీడు గ్రామానికి చెందిన పింజరి సుభాన్ గతనెల 31న అనారోగ్యంతో మృతి చెందారు. సుమారు ఏడాది క్రితమే అతని భార్య హసీనా కూడా అనారోగ్యంతో మృతి చెందారు. వారికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. తల్లిదండ్రులు ఇద్దరూ చనిపోవడంతో పిల్లలు అనాథలుగా అవ్వ వద్ద ఉంటున్నారు. తల్లిదండ్రులను కోల్పోయిన ఆ పిల్లలను ఆదుకునేందుకు దూదేకుల నూర్ బాషా సంఘం తరపున ఆలూరు, చిప్పగిరి, ఆదోని, హోళగుంద, కౌతాళం, దేవనకొండ మండలాల నుంచి తమ వంతు ఆర్థిక సహాయాన్ని సేకరించి రూ.1.10 లక్షల నగదును సోమవారం పెద్దమర్రివీడు గ్రామంలో పిల్లల అవ్వ చేతికి అందజేశారు. పిల్లల సంరక్షణ కోసం ఆర్థిక సహాయం సేకరించి అందజేసిన నూర్ బాషా సంఘం వారికి గ్రామస్తులు అభినందనలు తెలిపారు. నూర్ బాషా దూదేకుల సంఘం జిల్లా అధ్యక్షులు సాయిబాబా, రాష్ట్ర ఉపాధ్యక్షులు షేక్షావలీ, తాలూకా అధ్యక్షులు శాలి సాహెబ్, గౌరవాధ్యక్షులు మలకన్న, జిల్లా కార్యదర్శి సత్తారు, గ్రామ నాయకులు దస్తగిరి, అబ్దుల్, రాజా సాహెబ్ పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

ప్రజాశక్తి - కౌతాళం

ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోనిఉపరహాళ్ గ్రామంలో 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు ఎలా అందుతున్నాయో ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకు రావాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ప్రతి ఇంటికీ సంక్షేమం పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని

అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

తెలిపారు. అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని చెప్పారు. చంద్రబాబు నాయుడును ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. రౌడూరు గ్రామంలో తాగునీటి కోసం రూ.43 లక్షలతో చేపడుతున్న పనులకు భూమి పూజ చేశారు. మండల నాయకులు అత్రి గౌడ్, ఏకం రెడ్డి, జడ్పిటిసి రాధా ప్రియదర్శిని, వైస్ ఎంపిపి బుజ్జి స్వామి, సుధాకర్ రెడ్డి, పాండురంగారెడ్డి, నర్సారెడ్డి, సోమిరెడ్డి, మల్లికార్జున, శివరాం, గురునాథ్ రెడ్డి, వడ్డే రాముడు, పాల్ దినకరన్, అబ్దుల్ సమ్మద్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రాక గ్రామానికి ఖర్మ

- మాధవరావు దేశాయ్

ప్రజాశక్తి - నందవరం

ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవ రెడ్డి తమ నందవరం గ్రామానికి రావడం తమ గ్రామానికి పట్టిన ఒక్కరోజు ఖర్మ అని మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు మాధవరావు దేశాయ్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సంక్రాంతి పండగ సందర్భంగా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపే బ్యానర్ ఏర్పాటు చేస్తే ఎమ్మెల్యే పింఛన్ల పంపిణీకి వస్తున్నారని, ఆ బ్యానర్లు తొలగించడం వైసిపి నాయకులకు సిగ్గుగా లేదా అని విమర్శించారు. ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో బ్యానర్ తొలగించి వైసిపి నాయకులు అలజడులు సృష్టిస్తున్నారని తెలిపారు. అలాంటి వాటిని ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. బ్యానర్ తొలగింపులో పోలీసులు కూడా అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని, వైసిపి నాయకులకు పోలీసులు తొత్తులుగా మారారని తెలిపారు. పింఛన్ల పంపిణీ ఇంత ఆర్భాటంగా పెట్టిన వైసిపి నాయకులు, మండలంలో దాదాపు 210 పింఛన్లను ఎందుకు తొలగించారో, సమావేశం ఏర్పాటు చేసి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బ్యానర్లు తొలగించినంత మాత్రాన ప్రజల గుండెల్లో టిడిపి అభిమానాన్ని తొలగించలేరని చెప్పారు. రాబోయే కాలంలో మండలంలోని వైసిపి నాయకులు కూడా బ్యానర్లు పెడతారని, ఒకసారి ఆలోచించి బ్యానర్లు, సమావేశాల విషయంలో ముందుకు వెళితే మంచిదని హితవు పలికారు.

శ్మశాన వాటికకు పొలం ఖరీదు ఇచ్చిన మంత్రి

- వైసిపి మండల కన్వీనర్ గుమ్మనూరు నారాయణ

ప్రజాశక్తి - చిప్పగిరి

శ్మశాన వాటికకు పొలం ఖరీదు చేసి మంత్రి గుమ్మనూరు జయరాం ఇచ్చినట్లు వైసిపి మండల కన్వీనర్ గుమ్మనూరు నారాయణ తెలిపారు. నేమకల్లు గ్రామంలో శ్మశాన వాటిక లేక చాలా ఇబ్బందులు పడుతున్నామనిసర్పంచి ప్రేమ్ కుమార్ ఆధ్వర్యంలో గ్రామ పెద్దలు మంత్రి గుమ్మనూరు జయరాం దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఆయన స్పందించి కన్వీనర్

పొలాన్ని పరిశీలిస్తున్న గుమ్మనూరు నారాయణ, సర్పంచి ప్రేమ్‌కుమార్

గుమ్మనూరు నారాయణకు ఆదేశాలు ఇచ్చారు. సోమవారం సర్పంచి ప్రేమ్ కుమార్, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో వైసిపి మండల కన్వీనర్ నారాయణ గ్రామానికి వచ్చి సమీపంలో ఉన్న 2 ఎకరాల 50 సెంట్ల భూమిని ఖరీదు చేశారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం సహకారంతో గ్రామానికి కావాల్సిన ఏ పనులైనా అత్యంత ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. త్వరలో జరగబోయే 'గడపగడపకు'లో రాంపురమయ్య వీధిలో సిసి రోడ్డు వేయిస్తామని తెలిపారు. గ్రామస్తుల ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఎంపిటిసిలు భీమలింగ, సుంకన్న, సచివాలయ కన్వీనర్లు గిరి, సుంకన్న, వైసిపి బీసీ నాయకులు రంగస్వామి, డాక్టర్ వీరాంజనేయులు, తిమ్మారెడ్డి, హేమంత్, మోహన్, గురుదాసు, విద్యా కమిటీ ఛైర్మన్ అశోక్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు నాగరాజు, మహేష్, గురునాథ, హనుమంతు, మాబుహుస్సేని పాల్గొన్నారు.

దేవాలయ నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి-కోసిగి రూరల్

మండలంలోని ఐరనగల్లు, జంపాపురం గ్రామాల మధ్య నూతనంగా నిర్మిస్తున్న కొరవ అంజినమ్మ అవ్వ దేవాలయానికి కోలమాన్‌పేట గ్రామానికి చెందిన యువనాయకులు ఉప్పలపాటి అర్జున్ రూ.5 వేల విరాళం అందజేశారు. అలాగే మండలంలోని దుద్ది గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న

విరాళం అందజేస్తున్న యువ నాయకులు ఉప్పలపాటి అర్జున్

శ్రీచౌడేశ్వరి దేవి విగ్రహ ప్రతిష్ఠాపనకు రూ.5 వేల విరాళం సోమవారం అందజేశారు. ఆయా గ్రామాల దేవాలయ కమిటీ పెద్దలు, భక్తులు పాల్గొని దాత ఉప్పలపాటి అర్జున్‌ను సోమవారం అభినందించారు. ఆపదలో ఉన్న వారికి, అవసరం ఉన్న వారికి ఆర్థిక సహాయం చేయడం ఎంతో హర్షించదగ్గ విషయమని పలువురు యువ నాయకులు అర్జున్‌ను కొనియాడారు. అనంతరం అర్జున్ మాట్లాడుతూ... దేవాలయాల అభివృద్ధికి ఎల్లప్పుడూ తోడ్పాటునందిస్తామని తెలిపారు.

ఒంగోలు ఎద్దుల బల ప్రదర్శన ఒక బలం

- ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

రైతులకు ఒంగోలు ఎద్దుల బల ప్రదర్శన ఒక బలమని ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఎమ్మిగనూరు శ్రీనీలకంఠేశ్వర స్వామి జాతర సందర్భంగా మండల కన్వీనర్ బిఆర్.బసిరెడ్డి ఆధ్వర్యంలో రైతు సంఘం రాష్ట్రస్థాయిలో నిర్వహించే ఒంగోలు ఎద్దుల బల ప్రదర్శన పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి, వైసిపి నియోజకవర్గ సీనియర్ నాయకులు జగన్మోహన్ రెడ్డి మాట్లాడారు. రైతు సంబరాలు పేరిట ఒంగోలు జాతి ఎద్దుల ప్రదర్శన రైతులకు ఎంతో ఉత్సాహాన్ని, ఉల్లాసాన్ని కలిగిస్తోందని తెలిపారు. ఎమ్మిగనూరు ప్రజలకు వైఎస్ఆర్ క్రికెట్ టోర్నమెంట్, ఫుట్ బాల్, వాలీబాల్, కబడ్డీ పోటీలతో పాటు మూడురోజుల పాటు ఎద్దుల బల ప్రదర్శన పోటీలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రైతులను అన్ని విధాలుగా ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా అందిస్తోందని తెలిపారు. సోగనూరు భీమిరెడ్డి, ఎంపిపి కేశన్న, మున్సిపల్ వైస్ ఛైర్మన్ డి.నజీర్ అహ్మద్, భాస్కర్ రెడ్డి, పేట శ్రీనివాస్ రెడ్డి, జిల్లా వక్ఫ్ బోర్డు ఉపాధ్యక్షులు రియాజ్ అహ్మద్, పట్టణ అధ్యక్షులు బుట్టా రంగయ్య, అధికార ప్రతినిధి సునీల్ కుమార్, వేణుగోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు ప్రదర్శనకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే ఎర్రకోట

వైసిపితోనే పేదల సంక్షేమం : ఎమ్మెల్యే

- కొత్తగా మంజూరయిన పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి - నందవరం

పేదల సంక్షేమ పాలన వైసిపితోనే సాధ్యమని, మూడున్నరేళ్ల పాలనలో ఎన్నో సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి జగన్ అందజేశారని ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి తెలిపారు. సోమవారం నందవరం పంచాయతీ కార్యాలయంలో నూతన పింఛన్లను ఎమ్మెల్యే చేతులమీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకొని ముఖ్యమంత్రి పింఛను పెంచుకొంటూ పోతున్నారని తెలిపారు. 2024 ఎన్నికల్లో మరోసారి జగన్‌ను ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని కోరారు. వైసిపి మండల నాయకులు శివారెడ్డి గౌడ్, కెఆర్.లక్ష్మీ కాంతారెడ్డి, ముగతి విరుపాక్షిరెడ్డి, జడ్పిటిసి నిఖిల్ చక్రవర్తి, సర్పంచి సావిత్రమ్మ, హజ్ కమిటీ రాష్ట్ర సభ్యులు అతావుల్లా, పేట శ్రీనివాసరెడ్డి, శంకర్ రెడ్డి, గురజాల నరసింహ రెడ్డి, నది కైరవాడి చాంద్ బాష, తహశీల్దార్ ఆనందరాజు, ఎంపిడిఒ కృష్ణమూర్తి, ఇఒఆర్‌డి ఈశ్వరయ్య, ఎపిఎం వీరన్న, టి.సోమాల గూడూరు వెంకటేశ్వర రెడ్డి, నందవరం ఎస్ఐ మహేష్ కుమార్ పాల్గొన్నారు.

నందవరంలో పింఛన్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి

వ్యకాస జిల్లా అధ్యక్షులుగా వీరశేఖర్

ప్రజాశక్తి- దేవనకొండ

దేవనకొండకు చెందిన వీరశేఖర్ వ్యకాస జిల్లా అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నిక కావడం పట్ల ప్రజాసంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం సిఐటియు మండల అధ్యక్ష, కార్యదర్శులు పాండు, అశోక్, రైతుసంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు బడేసాబ్, సూరి, వ్యకాస మండల అధ్యక్ష, కార్యదర్శులు నాగేష్, మహబూబ్ బాషా మాట్లాడారు. యువజన సంఘం మండల నాయకునిగా, జిల్లా కార్యదర్శిగా వీరశేఖర్ పని చేశారని తెలిపారు. అలాగే సిఐటియు పత్తికొండ డివిజన్ అధ్యక్షులుగా, కార్యదర్శిగా, జిల్లా ఉపాధ్యక్షులుగా, వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులుగా అనేక పోరాటాల్లో పాల్గొన్నారని చెప్పారు. వీరశేఖర్‌ను వ్యకాస జిల్లా అధ్యక్షులుగా జిల్లా మహాసభలో ఏకగ్రీవంగా ఎన్నుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. వీరశేఖర్ నాయకత్వంలో జిల్లాలో వ్యవసాయ కార్మికుల సమస్యలపై మరిన్ని సమరశీల పోరాటాలు జరగాలని ప్రజాసంఘాల సీనియర్ నాయకులు యూసుఫ్ బాషా, బజారి, కెపి.రాముడు, నాగేష్, పరమేష్ ఆకాంక్షించారు.

శ్మశాన వాటికకు ఐదెకరాల భూమి కేటాయించాలి : కెవిపిఎస్

ప్రజాశక్తి - ఆదోని

పెరుగుతున్న పట్టణ జనాభాకు అనుగుణం గా శ్మశాన వాటికకు ఐదెకరాల భూమిని కేటాయించాలని కెవిపిఎస్ నాయకులు అంజి, నాగేంద్ర, విజయ్, గోపాల్, లక్ష్మన్న, తిప్పన్న డిమాండ్ చేశారు. సోమవారం మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పట్టణ జనాభా రోజురోజుకు పెరుగుతోందని, ప్రస్తుతం ఉన్న శ్మశాన వాటికలో స్థలం లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. శ్మశాన వాటికలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు.

వైసిపితోనే ఎస్సీలకు న్యాయం

- ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు నాగరాజు

ప్రజాశక్తి - చిప్పగిరి

ఎస్సీ, ఎస్టీలకు సమ ప్రాధాన్యత ఇచ్చి ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి వైసిపి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు నాగరాజు తెలిపారు. సోమవారం చిప్పగిరిలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ స్వగ్రామమైన నేమకల్లు ఎస్సీ కాలనీలో రహదారి సరిగ్గా లేదని, సిసి రోడ్డు వేయాలని కన్వీనర్ గుమ్మనూరు నారాయణ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. ఆయన మంత్రి దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందిస్తూ రహదారి ఏ కొలతలు ఉన్నాయో అంచనా వేసి పంచాయతీ తీర్మాన పత్రాన్ని సిద్ధం చేసుకోమని తెలిపారని అన్నారు. తమకు అన్ని రకాలుగా సహాయ, సహకారాలు అందిస్తున్న డాక్టర్ వీరాంజనేయులుకు కృతజ్ఞతలు తెలిపారు. తలారి హనుమంతు, ఎంసి.శివ, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

కడుపునొప్పితో విఆర్ఎ మృతి

ప్రజాశక్తి- దేవనకొండ

మండలంలోని తెర్నేకల్ గ్రామంలో తలారి నాగప్ప (58) కడుపునొప్పి తాళలేక ఆదివారం సాయంత్రం మృతి చెందారు. మృతుని దహన సంస్కారాల నిమిత్తం రెవెన్యూ సిబ్బంది ఆర్ఐ విష్ణు మాధవ్, జూనియర్ అసిస్టెంట్ నబి రసూల్, విఆర్ఒ బి.కౌలుట్ల రూ.15 వేలను సోమవారం అందజేశారు. మృతుని కుటుంబానికి వారసత్వంగా ఒకరికి ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చారు. విఆర్ఎల సంఘం నాయకులు రామాంజనేయులు, గ్రామ సేవకులు రాఘవేంద్ర, చంద్ర పాల్గొన్నారు.

సమన్వయంతోనే గ్రామాభివృద్ధి

- సర్పంచి ప్రేమ్ కుమార్, సచివాలయ కన్వీనర్ గిరి

ప్రజాశక్తి - చిప్పగిరి

గ్రామం అభివృద్ధి చెందాలంటే సచివాలయ అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ముందుకెళ్లాలని సర్పంచి ప్రేమ్‌కుమార్, సచివాలయ కన్వీనర్ గిరి ప్రసాద్ తెలిపారు. సోమవారం నేమకల్లు సచివాలయ కార్యాలయంలో సర్పంచి ప్రేమ్ కుమార్ ఆధ్వర్యంలో సచివాలయ కన్వీనర్‌గా ఎన్నికైన గిరిప్రసాద్‌ను పూలమాల, శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా గిరి మాట్లాడారు. గ్రామ సమస్యలు పరిష్కరించేందుకు, సచివాలయాలకు వచ్చిన ప్రతి దరఖాస్తును పరిష్కరించేలా చూడాలని సచివాలయ అధికారులకు సూచించారు. డాక్టర్ వీరాంజనేయులు, గురుదాసు పాల్గొన్నారు.

గిరిజన గురుకుల విద్యార్థినులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-ఆలూరు

ఆలూరులోని ప్రభుత్వ గిరిజన గురుకుల బాలికల విద్యార్థులకు రిన్యూ పవర్ ఆధ్వర్యంలో సోమవారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రిన్యూ పవర్ అడ్మిన్ శ్రీనివాసులు, సైట్ మేనేజర్ ఉదయ్ మాట్లాడారు. పేద, బడుగు, బలహీన వర్గాలకు సహాయం చేయడంలో రిన్యూ పవర్ సంస్థ ముందుంటుందన్నారు. 300 మంది పేద గిరిజన గురుకుల విద్యార్థినులకు దుప్పట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. పాఠశాల వైస్ ప్రిన్సిపల్ రాజేంద్ర, ఉపాధ్యాయులు రంగబాబు, సూర్య ప్రకాష్, మల్లికార్జున, విజయ కుమారి, ఉమా మహేశ్వరి పాల్గొన్నారు.

'యూనివర్సిటీ సూపరింటెండెంట్‌పై చర్యలు తీసుకోవాలి'

ప్రజాశక్తి - ఆదోని

అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన రాయలసీమ యూనివర్సిటీ సూపరింటెండెంట్‌పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని దళిత సంఘాల నాయకులు టి.వీరేష్, విజయ్, జగన్, మణికంఠ, సాయిరాం డిమాండ్ చేశారు. సోమవారం ఆదోని డీఎస్పీ వినోద్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాయలసీమ యూనివర్సిటీ సూపరింటెండెంట్ ఇస్మాయిల్, యూనివర్సిటీలో పనిచేస్తున్న ఉద్యోగికి ఫోన్ చేసి అంబేద్కర్‌పై అనుచితంగా మాట్లాడడం విచాకరమని తెలిపారు. ఆయనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కోరారు. దళిత నాయకులు లక్ష్మన్న, విజయ్, ప్రకాష్ పాల్గొన్నారు.

జగన్మోహన్ రెడ్డి పాలన పట్ల ప్రజలు విసుగెత్తిపోయారు

- మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు

ప్రజాశక్తి - ఆదోని

అనాలోచిత నిర్ణయాల వల్ల ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాలన పట్ల రాష్ట్ర ప్రజలు విసుగెత్తిపోయారని, వచ్చే ఎన్నికల్లో ఇంటికి సాగనంపడం ఖాయమని ఆదోని మాజీ ఎమ్మెల్యే, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ మీనాక్షి నాయుడు తెలిపారు. సోమవారం సంతేకుడ్లూరు గ్రామంలో 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' నిర్వహించారు. టిడిపి బృందానికి స్థానిక నాయకులు ఘన స్వాగతం పలికారు. టిడిపి నాయకులు, క్లస్టర్ యూనిట్ సభ్యులు కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుంటూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా మీనాక్షి నాయుడు మాట్లాడారు. వైసిపి ప్రభుత్వ పాలనలో దౌర్జన్యాలు, అరాచకాలకు అడ్డు అదుపు లేకుండా పోయిందని మండిపడ్డారు. నిత్యావసర సరుకుల

మీనాక్షి నాయుడును సన్మానిస్తున్న నాయకులు, కార్యకర్తలు

ధరలు పెరగడంతో సామాన్యుల బతుకు భారమైందన్నారు. వైసిపి ప్రభుత్వం అన్ని రకాలుగా ప్రజలను మోసం చేసిందని దుయ్యబట్టారు. టిడిపి హయాంలో జరిగిన అభివృద్ధి తప్ప వైసిపి ప్రభుత్వంలో కనీసం రోడ్ల గుంతలకు మట్టి కూడా వేయలేదని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో టిడిపి గెలవడం ఖాయమని జోస్యం చెప్పారు. టిడిపి కర్నూలు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి భూపాల్ చౌదరి, వీరేష్, లోక్‌నాథ్ రెడ్డి, పీరా, గోవిందప్ప, ఎల్లప్ప, సోమన్న, సాబ్, రవి ప్రకాష్, మల్లికార్జున, రంగస్వామి నాయుడు, రంగన్న, మారుతి నాయుడు, బుద్దారెడ్డి, రామకృష్ణ, బసవరాజు, మాధవ్, లక్ష్మన్న, సత్తన్న, అన్వర్ బాష, మాబాష పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - మంత్రాలయం

మంత్రాలయంలోని రాఘవేంద్ర నగర్‌కు చెందిన వైసిపి నాయకుడు, మృతుడు నాగరాజు కుటుంబానికి వైసిపి యువనేత ప్రదీప్ రెడ్డి దహన సంస్కార ఖర్చులకు రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. నాగరాజు ఆదివారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న ప్రదీప్‌రెడ్డి సోమవారం మంత్రాలయం చేరుకుని నాగరాజు మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన సొంతంగా రూ.10 వేలు, వైఎస్ఆర్ బీమా పథకం కింద తక్షణ సహాయం రూ.10 వేలు, సర్పంచి తెల్లబండ్ల భీమయ్య రూ.5 వేల నగదును కుటుంబ సభ్యులకు అందజేశారు. నాగరాజు కుటుంబానికి అండగా ఉంటామని ప్రదీప్‌రెడ్డి హామీ ఇచ్చారు. వైసిపి పట్టణ కార్యదర్శి అశోక్ రెడ్డి, వెల్ఫేర్ అధికారిణి అనిత ఉన్నారు.

ముగిసిన ఆరాధన ఉత్సవం

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని పట్టణంలో ఆలూరు రోడ్డులో వెలసిన సద్గురు భంభం స్వామి ఆరాధన మహోత్సవం సోమవారం వైభవంగా ముగిసింది. సద్గురు భంభం నరసప్ప స్వాముల వారు తమ గురువు కోసం ఆశ్రమాన్ని ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు గురువు ఆరాధన మహోత్సవాలు జరుగుతున్నాయని భక్తులు తెలిపారు. రెండు రోజులపాటు ఉరుసు మహోత్సవాలు జరుపుకున్నారు. చిప్పగిరికి వెళ్లి శ్రీసద్గురు భంభం స్వామి వారి గంధం తెచ్చి ఉరుసును ప్రారంభించినట్లు చెప్పారు. భజన కార్యక్రమాలు నిర్వహించారు. పెసలబండ, సుల్తానాపురం, పెద్దకొత్తిలి గ్రామం నుంచి భక్తులు వచ్చి భజన నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులుగా రాయదుర్గం దర్గా పీఠాధిపతులు బాబు స్వామి వచ్చారు. స్వామి వారికి గురుపూజ నిర్వహించామని ఆశ్రమ నిర్వాహకులు తెలిపారు.

అంగన్వాడీలకు కనీస వేతనమివ్వాలి

- సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

అంగన్వాడీ కార్మికులకు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి బి.గోవర్ధనమ్మ, సిఐటియు మండల కన్వీనర్ బి.రాముడు డిమాండ్ చేశారు. సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎన్నికల ముందు అంగన్వాడీలకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అనేక హామీలు ఇచ్చారని, మూడున్నర సంవత్సరంలో ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక యాప్‌లు పెట్టి నెట్ రాక అనేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ మెనూ చార్జీలు పెంచడం లేదని, నాణ్యమైన పోషకాహారం ఎలా అందిస్తారని ప్రశ్నించారు. ప్రభుత్వ ఉద్యోగులుగా ముద్ర వేసి సంక్షేమ పథకాల్లో కోత కోయడం దుర్మార్గమన్నారు. నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని, గ్రాట్యుటీ, పింఛను ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ వర్కర్లు శైలజా, సునంద, ప్రమీల, హేమలత, చిట్టెమ్మ, జీనోత్, అరుణ, గౌసియా, నిర్మల, లత పాల్గొన్నారు. **ఆదోని** మున్సిపల్ గ్రౌండ్ నుంచి ప్రదర్శన నిర్వహిస్తూ ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. అనంతరం సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా కార్యదర్శి వెంకటమ్మ, జిల్లా నాయకులు వరలక్ష్మి, సిఐటియు పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు తిప్పన్న, గోపాల్, మండల కార్యదర్శి వీరారెడ్డి, యూనియన్ గౌరవాధ్యక్షులు లక్ష్మన్న మాట్లాడారు. అంగన్వాడీ కేంద్రాలను కొత్తగా సచివాలయాలు పర్యవేక్షణ చేయాలని నిర్ణయించడం తగదన్నారు. ఇప్పటికే ఐసిడిఎస్ అధికారులు, పీడీ, సిడిపిఒ, సూపర్‌వైజర్లు పర్యవేక్షిస్తున్నారని తెలిపారు.

ఎమ్మిగనూరులో వినతిపత్రం అందజేస్తున్న అంగన్వాడీలు, నాయకులు

ఆదోనిలో ధర్నా చేపడుతున్న అంగన్వాడీలు

సీజనల్ హాస్టల్‌ను వినియోగించుకోండి : ఎంఇఒ

ప్రజాశక్తి - హాలహర్వి

విద్యార్థులు సీజనల్ హాస్టల్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎంఇఒ ఈరన్న కోరారు. సోమవారం మండలంలోని నిట్రవట్టి గ్రామంలో సీజనల్ హాస్టల్‌ను ఎంఇఒ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ గ్రామంలో సీజనల్ హాస్టల్ ఏర్పాటు చేయడం శుభపరిణామమని తెలిపారు. ఏ మండలంలోనూ నాలుగు సీజనల్ హాస్టళ్లను ఏర్పాటు చేయలేదన్నారు. నిట్రవట్టి, బిలేహాల్ గ్రామాల్లో ఎక్కువగా తల్లిదండ్రులతో పాటు విద్యార్థులు వలస వెళ్తూ చదువుకు దూరమవుతున్నారని తెలిపారు. విద్యార్థులు చదువుకు దూరం కాకుండా చూసేందుకు ప్రభుత్వం సీజనల్ హాస్టల్ ఏర్పాటు చేసిందని చెప్పారు. డిసెంబర్ నుంచి ఏప్రిల్ వరకు సీజనల్ హాస్టల్ కొనసాగుతుందని తెలిపారు. ఎపిఎం శివయ్య పాల్గొన్నారు.

మంత్రాలయం చేరుకున్న పాదయాత్ర భక్తులు

ప్రజాశక్తి - మంత్రాలయం

మంత్రాలయం చేరుకున్న పాదయాత్రికులు

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో కొలువైన శ్రీరాఘవేంద్రస్వామిని దర్శించుకునేందుకు కర్ణాటక భక్తులు పాదయాత్ర ద్వారా మంత్రాలయం చేరుకున్నారు. సోమవారం కర్ణాటక రాష్ట్రం సిరుగుప్పకు చెందిన సుమారు వెయ్యి మంది పాదయాత్ర భక్తుల బృందం రాఘవేంద్ర సర్కిల్‌లో భజన పాటలతో నృత్యం చేస్తూ వీనులవిందు చేశారు. ఆర్యవైశ్య మండలి హెచ్‌జి.హనుమంతయ్య, మంజునాథ్, నాగరాజు, లక్ష్మినారాయణ ఆధ్వర్యంలో 27వ సంవత్సరం పాదయాత్ర అని, ఈనెల 7న సిరుగుప్పలో పాదయాత్ర ప్రారంభించామని సోమవారం మధ్యాహ్నం 1 గంటకు చేరుకున్నామని మంజునాథ్ తెలిపారు. గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్రుని మూల బృందావనాన్ని దర్శించుకున్నారు. అనంతరం యోగీంద్ర సభా మండపంలో పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులకు డ్రైఫ్రూట్ ద్వారా తులాభారం పుష్పాభిషేకం నిర్వహించారు.

పెండింగ్ డిఎలను మంజూరు చేయాలి

- ఎస్‌టియు రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి నాగరాజు

ప్రజాశక్తి - ఆదోని

సమావేశంలో మాట్లాడుతున్న నాగరాజు

పెండింగ్ డిఎలను వెంటనే మంజూరు చేయాలని ఎస్‌టియు రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి నాగరాజు డిమాండ్ చేశారు. సోమవారం ఆదోని నెహ్రూ స్మారక మున్సిపల్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడున్నర ఏళ్లలో ఒక్క డిఎ కూడా మంజూరు చేయలేదన్నారు. 144 నెలల డిఎ బకాయిలున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం విచారకరమని తెలిపారు. సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని, ఉపాధ్యాయులు భవిష్యత్తు అవసరాల కోసం దాచుకున్న పిఎఫ్, ఎపిజిఎల్‌ఐ, జిఐఎస్ తదితర మొత్తాన్ని కూడా మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు, జీతభత్యాలు తదితర విషయాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు. ప్రహ్లాద, మారయ్య, ప్రసాద్, రామయ్య, ఉరుకుందప్ప, కల్యాణ్ రావు, సతీష్, విజయ్ పాల్గొన్నారు.

బాధ్యతలను స్వీకరిస్తున్న ప్రసాదరాజు

'నన్నయ' ఇన్‌ఛార్జి విసిగా ప్రసాదరాజు

ప్రజాశక్తి - రాజానగరం(తూర్పుగోదావరి జిల్లా)

తూర్పుగోదావరి జిల్లా రాజానగరంలో ఉన్న ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఇన్‌ఛార్జి విసిగా డాక్టర్ జివిఆర్ ప్రసాదరాజు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకూ విసిగా ఉన్న మొక్కా జగన్నాథరావు ఈ నెల ఏడున ఉద్యోగ విరమణ పొందారు. దీంతో కాకినాడ జెఎన్‌టియు ఉపకులపతిగా ఉన్న జివిఆర్ ప్రసాదరాజుకు ఇన్‌ఛార్జి బాధ్యతలను అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఆయన సోమవారం యూనివర్సిటీలో బాధ్యతలను స్వీకరించారు. యూనివర్సిటీ అధికారులు, అధ్యాపకులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ అందరి సమన్వయంతో విశ్వవిద్యాలయం అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు.

హక్కులను కాలరాస్తున్న వైసిపి

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ప్రజాశక్తి-విజయనగరం కోట

ప్రతిపక్షాల, ప్రజాసంఘాల హక్కులను రాష్ట్ర ప్రభుత్వం కాలరాస్తోందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. జిఒ ఒకటిపై ప్రతిపక్షాలన్నీ కలిసి పోరాటం చేస్తాయని తెలిపారు. టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు పి.అశోక్‌గజపతి రాజును సోమవారం ఆయన బంగ్లాలో రామకృష్ణ మర్యాద పూర్వకంగా కలిశారు. పలు విషయాలపై ఇద్దరూ చర్చించారు. అనంతరం రామకృష్ణ మీడియాతో మాట్లాడుతూ.. అశోక్‌తో తనకు ఎప్పటి నుంచో మంచి అనుబంధం ఉందని, అందువల్లే ఆయనను కలుసుకున్నానని తెలిపారు. స్పీకర్ స్థానంలో ఉన్న వ్యక్తి కూడా దారుణంగా వ్యవహరిస్తున్నారని, మంత్రులు సైతం ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. జిఒ నంబరు ఒకటితో రాష్ట్రంలో గందరగోళం సృష్టిస్తున్నారని విమర్శించారు. ప్రతిపక్షాలకు జిఒ ఒకటి గురించి అర్థం కావడం లేదంటూ బొత్స సత్యనారాయణ మాట్లాడుతున్నారని, తమకు క్లాసుపెట్టి మంత్రి వివరిస్తే బాగుంటుందని ఎద్దేవా చేశారు. బొత్సకు ఏ విషయంలోనూ సరిగా మాట్లాడడం చేతకాదని విమర్శించారు. వైసిపి దుర్మార్గాలపై పోరాటం ఆగదని తెలిపారు.

ముస్లిముల సంక్షేమం పట్టని ప్రభుత్వాలు

- అవాజ్ రాష్ట్ర మహాసభలో వక్తలు
- రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులుగా సుభాన్, చిష్టీ

మాట్లాడుతున్న ఎం.ఎ.గపూర్

ప్రజాశక్తి- గుంటూరు

అవాజ్ రాష్ట్ర నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా ఎస్.ఎ.సుభాన్, ఎం.ఎ.చిష్టీ ఎన్నికయ్యారు. గుంటూరులోని లాల్‌జాన్ బాషా షాధీఖానాలో రెండు రోజులపాటు జరిగిన ఆవాజ్ రాష్ట్ర రెండో మహాసభ సోమవారం ముగిసింది. ఎండి.ముర్తుజా ప్రాంగణంలో జరిగిన ఈ మహాసభలో మొత్తం 30 మందితో రాష్ట్ర నూతన కమిటీ ఏర్పాటైంది. ఉపాధ్యక్షులుగా ఎస్ఎకె జిలానీ, షేక్ అబుబకర్, సహాయ కార్యదర్శులుగా షేక్ యాజ్‌దాని, కోశాధికారిగా ఎం.ఎ.ఎ.అష్రఫ్ ఎన్నికయ్యారు. ఎస్.ఎ.సుభాన్, ఎస్.కె జిలానీ, అష్రాఫ్, రషీద్ అధ్యక్షవర్గంగా వ్యవహరించిన మహాసభలో ఆవాజ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఎం.ఎ.గపూర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ నవరత్నాల్లో మైనార్టీలకు ఒక్క పథకమూ లేదని, పాత పథకాలన్నీ రద్దు చేసిందని విమర్శించారు. సచార్ కమిటీ, రంగనాథ్ మిశ్రా కమిటీ సిఫార్సులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవట్లేదన్నారు. డైట్ కాలేజీల్లో ఉర్దూ బోధనకు అధ్యాపకులు లేరని, ఉర్దూ విద్యకు జూనియర్ కాలేజీలు లేవని తెలిపారు. ముస్లిములకు కొన్ని పదవులిచ్చినంత మాత్రాన సామాజిక న్యాయం రాదని, వారి ఆర్థిక, సాంఘిక జీవనంలో మార్పులు వచ్చే చర్యలు చేపట్టాలని అన్నారు. ఉర్దూ అకాడమీకి, వక్ఫ్ బోర్డుకు చైర్మన్లను నియమించాలని, మైనార్టీ ఫైనాన్స్ కమిషన్‌కు నిధులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు, జగన్మోహన్‌రెడ్డి ఇద్దరూ ముస్లిం మైనార్టీలకు చేసిందేమీ లేదన్నారు. రాబోయే కాలంలో ముస్లిముల సంక్షేమం, భద్రత కోసం పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టనున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర అవాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎం.డి.అబ్బాస్ మాట్లాడుతూ విద్య, ఉపాధి, ఇతర అన్ని రంగాల్లోనూ ముస్లిం మైనార్టీలు వెనుకబడి ఉన్నారన్నారు. ఇప్పటికీ 22 శాతం ముస్లిం పిల్లలు విద్యకు దూరంగా ఉన్నారని, బాల కార్మికుల్లో వారే అధికమని తెలిపారు. ముఖ్యంగా ముస్లిం మహిళల్లో విద్య అతి తక్కువగా ఉందన్నారు. ఉపాధి రంగంలో 98 శాతం మంది కనీస వేతనాలులేని అసంఘటిత రంగంలోనే పనిచేస్తున్నారని, 63 శాతం మందికి సొంత భూమిలేదని, 45 శాతం మంది అద్దె ఇళ్లలో ఉంటున్నారని తెలిపారు. ముస్లిముల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన నిధులు కేటాయించట్లేదన్నారు.

కేంద్ర ప్రభుత్వం మైనారిటీ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు రద్దు చేయడం దుర్మార్గమని తెలిపారు. దీనివల్ల మైనార్టీలు విద్యకు పూర్తిగా దూరమవుతారన్నారు. దేశంలో ముస్లిముల సాంస్కృతిక అంశాలపై పెద్ద ఎత్తున దాడి జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. హిజాబ్ వివాదం వల్ల కర్ణాటకలో 40 వేల మంది బాలికలు విద్యకు దూరమయ్యారని తెలిపారు.

పలు తీర్మానాలు ఆమోదం

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మైనార్టీలపై భౌతిక, సాంస్కృతిక దాడులు ఆపాలని, రాష్ట్ర ప్రభుత్వం ముస్లిములకు సబ్సిడీ రుణాలు, దుల్హన్, రంజాన్ తోఫా, విదేశీ విద్య వంటి పథకాలను పునరుద్ధరించాలని మహాసభ డిమాండ్ చేసింది. ఈ మేరకు తీర్మానాలను ఆమోదించింది. ఉర్దూ భాషను రాష్ట్రంలో రెండో అధికార భాషగా అభివృద్ధి చేస్తామని 2019లో ప్రభుత్వం చేసిన వాగ్దానాన్ని నిలబెట్టు కోవాలని, కేంద్ర ప్రభుత్వం మైనార్టీలకు రద్దు చేసిన స్కాలర్‌షిప్‌లను, ఫెలోషిప్‌లను తిరిగి పునరుద్ధరించాలని, ప్రభుత్వరంగ సంస్థల ప్రయివేటీకరణ ఆపాలని, ఉపా చట్టాన్ని ఉపసంహరించుకోవాలని, మైనార్టీల సంక్షేమానికి సబ్‌ప్లాన్ చట్టం అమలుకు చర్యలు తీసుకోవాలని, వక్ఫ్‌బోర్డు ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా పటిష్టమైన చర్యలు తీసుకొని పేద ముస్లిముల కోసం వినియోగించాలని తదితర తీర్మానాలను మహాసభ ఆమోదించింది. బడ్జెట్ కేటాయించి కర్నూలులోని ఉర్దూ యూనివర్సిటీని అభివృద్ధి చేయాలని, శాశ్వత ప్రాతిపదికన సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేసింది.

సమాజానికి ప్రేరణ కవిత్వం : మాజీ ఎంపీ బుట్టా రేణుక

బుట్టారేణుకను అభినందిస్తున్న మాజీ మంత్రి మండలి బుద్ధప్రసాద్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

సమాజ మార్పునకు అవసరమైన ప్రేరణ కవిత్వమని మాజీ ఎంపీ బుట్టా రేణుక అన్నారు. సోమవారం నగరంలోని స్థానిక కెవిఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో నవ్యాంధ్ర రచయిత్రుల సంఘం (నరసం) ఆధ్వర్యంలో ఆ సంఘం నాలుగవ రాష్ట్ర వార్షికోత్సవ సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి బుట్టా రేణుక, మాజీ మంత్రి మండలి బుద్ధ ప్రసాద్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అభివృద్ధికర సమాజం కోసం స్త్రీలు పాటుపడుతుండడం హర్షణీయమన్నారు. మహిళలు ఆకాశంలో సగం అవనిలో సగం నానుడికి ఈ సదస్సు దర్పణం పట్టిందన్నారు. సమాజ ప్రేరణ కోసం ఉత్తమ కవిత్వాన్ని, రచనలను సమాజానికి అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కవయిత్రులు, కెవిఆర్ కాలేజీ ప్రిన్సిపల్ ఇందిరా శాంతి, నరసం నరసం కర్నూలు ప్రధాన కార్యదర్శి దండెబోయిన పార్వతీదేవి, ఎస్‌వివిజయ మనోహరి తదితరులు పాల్గొన్నారు.

గార్గేయపురం పిహెచ్‌సిలో గర్భిణులకు సలహాలు సూచనలు చేస్తున్న డాక్టర్ జయలక్ష్మి

గర్భిణులకు జాగ్రత్తలు తప్పనిసరి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

పుట్టబోయే బిడ్డ ఆరోగ్యం కోసం గర్భిణీలు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని గార్గేయపురం పిహెచ్‌సి వైద్యాధికారి జయలక్ష్మి అన్నారు. సోమవారం పిహెచ్‌సిలో జనని సురక్ష యోజన వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె వైద్య సిబ్బందితో కలిసి గర్భిణులకు పలు సూచనలు సలహాలు చేశారు. గర్భిణులు రక్తం వృద్ధి చెందేందుకు అవసరమైన పోషక ఆహార పదార్థాలు తరచుగా తీసుకోవాలన్నారు. పడుకునే ముందు కొంత సమయం నడకను అలవాటు చేసుకోవాలన్నారు. ఎడమవైపుకు తిరిగి పడుకోవడం వల్ల గర్భస్థ శిశువుకు రక్తప్రసరణ విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉంటాయన్నారు. స్టాఫ్ నర్స్ నిర్మలతో పాటు పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ ఎస్ఇ

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

జిల్లా విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి డయల్ యువర్ ఎస్ఇ (సూపరింటెండెంట్ ఇంజనీర్) కార్యక్రమాన్ని ఈనెల 10న మంగళవారం ఉదయం 10:00 గంటల నుండి 11:00 గంటల వరకు నిర్వహిస్తామని కర్నూలు ఎపి ఎస్‌పిడిసిఎల్ ఎస్ఇ ఉమాపతి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను గురించి 7382 614308 సెల్ నెంబర్ కు ఫోన్ చేసి సమస్యల పరిష్కరించుకోవాలన్నారు.విద్యుత్ వినియోగదారులు ఈ సదవకాశాన్ని ఉపయోగించుకోవాలన్నారు.

స్పందనకు రెండు వినతులు

ప్రజాశక్తి-సి బెళగల్

సోమవారం తహసీల్దార్ శివశంకర్ నాయక్ స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఇందుకు ఆయా శాఖాధికారులు పాల్గొనగా ఇద్దరు రైతులు భూములు ఆన్‌లైన్ చేయాలంటూ స్పందనలో విన్నవించారు. ప్రతి సోమవారం స్పందన వినతులకు సత్వరపరిష్కారం చూపాల్సిన బాధ్యత మనకుందని తహసీల్దార్ శివశంకర్ నాయక్ ఆయా శాఖల అధికారులతో,సిబ్బందితో పేర్కొన్నారు.

మహాజన సోషలిస్ట్ పార్టీ కన్వీనర్లు ఎంపికపై హర్షం

ప్రజాశక్తి-తుగ్గలి

కర్నూలు జిల్లా మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా కన్వీనర్‌గా సుభాష్ చంద్ర, కో కన్వీనర్ గా రామకొండ వెంకటేష్ ఎంపిక పట్ల ఎంఆర్‌పిఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ ఆదేశాల మేరకు మహాజన సోషలిస్ట్ పార్టీ నుండి సోమవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో మహాజన సోషలిస్ట్ పార్టీ బలోపేతానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. ఈ ఎంపిక పట్ల ఎంఆర్‌పిఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు

ఇళ్ల నిర్మాణాలు 31నాటికి పూర్తి చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రూఫ్ లెవెల్ , రూఫ్ కాస్ట్ లెవెల్‌లో ఉన్న ఇళ్ళ నిర్మాణాలు జనవరి 31నాటికి ఖచ్చితంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు హౌసింగ్ పిడి, ఇంజనీర్లను ఆదేశించారు. సోమవారం సాయంత్రం ఆయన మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ హౌసింగుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉగాది నాటికి నిర్మాణంలో ఉన్న ఇళ్లను గృహ ప్రవేశాలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. గడప గడపకు సంబంధించిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. టెండర్ ప్రక్రియలో ఉన్న వాటిని త్వరితగతిన పూర్తి చేయించాలని అన్నారు. పనులు మొదలైన వాటి యొక్క పురోగతిని ఫోటోస్ తీసి అప్లోడ్ చేయాలన్నారు. 10 వ తరగతి , ఇంటర్మీడియట్ విద్యార్థుల కుల ధృవీకరణ పత్రాలు విఆర్ఒ లాగిన్ లో పెండింగ్‌లో ఉన్నాయని విఆర్‌ఓలు వెరిఫై చేసిన తర్వాత తహశీల్దార్లు అప్రూవ్ చేసిఇవ్వాలన్నారు.మన బడి నాడు-నేడుకు సంబంధించి ఎక్స్‌పెండిచర్ బుకింగ్ పురోగతి గురించి జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలకు సంబంధించి వివిధ దశల్లో ఉన్న నిర్మాణాల్లో పురోగతి సాధించేలా కృషి చేయాలన్నారు. జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి మాట్లాడుతూ స్మశానవాటికలకు సంబంధించి స్థలాలు బాగా గుర్తించారని పెండింగ్‌లో ఉన్న 8 చోట్ల కూడ త్వరగా గుర్తించాలని ఆదేశించారు.

సివిల్ సప్లయ్ హమాలీ కార్మికుల పెంచాలి: సిఐటియు

ప్రజాశక్తి-గూడూరు

సివిల్ సప్లయ్ హమాలీ కార్మికులకు పెంచిన కూలీ రేట్లు జీఓను వెంటనే విడుదల చేయాలని గూడూరు సివిల్ సప్లయ్ గోడం దగ్గర సిఐటియు అధ్వర్యంలో సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. సిఐటియు డివిజన్ కార్యదర్శి జె.మోహన్ మాట్లాడుతూ 2022 జనవరి ఒకటో తేదీ నుండి కొత్త కూలి రేట్లు సివిల్ సప్లయ్ కార్మికులకు ఇవ్వాలన్నారు. కొత్త కూలి రేట్లు కోసం సివిల్ సప్లయ్ హమాలీ కార్మికులు అనేక పోరాటాలు అనంతరం రాష్ట్ర ప్రభుత్వ ఆమోదించిందని, రేట్లు పెరిగి దాదాపు నాలుగు సంవత్సరాలు పూర్తవుతున్నా ఇంతవరకు జీవోను రాష్ట్ర ప్రభుత్వ విడుదల చేయకుండా కాలయాపన చేస్తుందన్నారు. అనారోగ్యంతో మరణించిన హమాలీ కార్మికుల స్థానంలో కొత్తగా వారి వారసులను పేర్లను సివిల్ సప్లయ్ నెంబర్లు ఎక్కించకుండా నిర్లక్ష్యం చేస్తుందన్నారు. అనారోగ్యంతో దిగిపోయిన హమాలీ కార్మికుల పిఎఫ్ అమౌంట్‌ను వెంటనే ఇవ్వాలని, సివిల్ సప్లయ్ హమాలీ కార్మికుల నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. గూడూరులో అదనపు గోడౌన్లను నిర్మించి వే బ్రిడ్జిని వేయాలని ఇఎస్ఐ పెన్షన్ సౌకర్యం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లయ్ హమాలీ యూనియన్ జిల్లా కోశాధికారికి రాజశేఖర్, నాయకులు వెంకటేశ్వర్లు, రంగన్న, సోమలింగడు, చిన్నరాజు, మద్దిలేటి, కొమ్మురాజు, మునియప్ప, దానమన్న పాల్గొన్నారు.

వైసిపి ఆధ్వర్యంలో ఘనంగా సంకల్ప యాత్ర వేడుక

వైసిపి కార్యాలయంలో మాట్లాడుతున్న బివై.రామయ్య

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్ : జగనన్న సంకల్పయాత్ర నాలుగేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం కర్నూలు నగరంలోని బిర్లా కాంపౌండ్‌లో ఉన్న వైసిపి జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు, నగర మేయర్ బివై రామయ్య, మాజీ ఎంపీ బుట్టా రేణుక వైసిపి రాష్ట్ర కార్యదర్శి సిహెచ్ మద్దయ్య లతోపాటు పలువురు వైసిపి నాయకులతో కార్యకర్తలతో కలసి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు భారీ కేకును కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ముందుగా వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నగర అధ్యక్షురాలు సిత్ర సత్యనారాయణమ్మ, నాయకులు ఎన్.గోపాల్ రెడ్డి, బెల్లం మహేశ్వర రెడ్డి, విక్రమసింహా రెడ్డి, శ్రీనివాస రెడ్డి, జిలాన్, ధనుంజయ ఆచారి, ఇలియాస్, ఇనూస్, ఆది మోహన్ రెడ్డి, బంగారు సత్యం, పుల్లారెడ్డి, రైల్వే ప్రసాద్, రాజశేఖర్, కేదార్నాథ్, చంద్రిక, శివరాం తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి-తుగ్గలి

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాదయాత్ర చేసి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా మండల కేంద్రమైన తుగ్గలిలో వైఎస్ఆర్ విగ్రహానికి స్థానిక నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, సచివాలయం కన్వీనర్ మోహన్ రెడ్డి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాదయాత్ర చేసి ప్రజలు మన్ననలు పొంది ముఖ్యమంత్రిగా విజయం సాధించారన్నారు. పాదయాత్రలో ఇచ్చిన హామీలన్నీ తూచా తప్పకుండా నెరవేర్చిన ఘనత జగన్మోహన్ రెడ్డికే దక్కిందన్నారు. ఎన్నికల్లో కూడా ముఖ్యమంత్రిగా విజయం సాధిస్తారన్న ఆశాభవాన్ని వారు వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపిటిసి రాజు, మాజీ సర్పంచి పురుషోత్తం, వైసిపి నాయకులు హనుమంత రెడ్డి, విష్ణువర్ధన రెడ్డి, సత్తప్ప, రంగన్న తదితరులు పాల్గొన్నారు. తుగ్గలి సచివాలయంలో కన్వీనర్ మోహన్‌రెడ్డి సచివాలయం ఉద్యోగులకు వాలంటీర్లకు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు.

స్కూల్ ప్రిన్సిపల్‌ను సస్పెండ్ చేయాలి : సి పి ఐ

ప్రజాశక్తి-వెల్దుర్తి

కర్నూలు జిల్లా క్రిష్ణగిరి మండలం మోడల్ స్కూల్ విద్యార్థి హంద్రీనీవా కాలువలోపడి మృతి చెందిన సంగతి పాఠకులకు విధితమే. విద్యార్థి మృతికి కారణమైన క్రిష్ణగిరి మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ ను సస్పెండ్ చేయాలని కోరుతూ విద్యార్థి కుటుంబ సభ్యులకు ఐదు లక్షలు ఎక్స్‌గ్రేషియా కల్పించాలన్నారు. విద్యార్థి మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలి కారకులైన వారిని సస్పెండ్ చేయాలని కోరుతూ సిపిఐ, ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో తహశీల్దార్ రాజేశ్వరికి సోమవారం వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి తల్లిదండ్రులు ఖాజా హుస్సేన్, సాహెరా, ఇబ్రహీం, ఫిరోజ్ బాషా సిపిఐ వెల్దుర్తి మండల కార్యదర్శి టి.కృష్ణ ఆలగుండు గ్రామ శాఖ కార్యదర్శి ఎల్లప్ప చిలిపికృష్ణ ఎఐఎస్ఎఫ్ నాయకులు అడవి రాముడు, బ్రహ్మం, ఎల్ల శేఖరు, శేషులు ఎల్లస్వామి పాల్గొన్నారు.

మోసగించారు న్యాయం చేయండి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

పలువురు మోసగాళ్లు చేసిన మోసాల నుంచి తమకు న్యాయం చేయాలని బాధితులు కోరారు. ఈ మేరకు సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో వారు తమ ఆవేదనను ఎస్‌పి సిద్ధార్థ కౌశల్ తో వెలిబుచ్చారు. అందులో ప్రధానంగా కుమార్తెకు హైదరాబాదులోని ఒక బీటెక్ కాలేజీలో కంప్యూటర్ సైన్స్ కోర్స్‌లో సీటు ఇప్పిస్తానని చెప్పి డబ్బులు తీసుకొని ఒక వ్యక్తి మోసం చేశాడని కర్నూలు వెంకటరమణ కాలనీకి చెందిన వెంకటేశ్వర్లు ఫిర్యాదు చేశారు. ఒక సినిమా నిర్మిస్తున్నానని చివరి దశలో ఉందని పార్టనర్ షిప్ ఇస్తానని చెప్పి డబ్బులు తీసుకొని మోసం చేశాడని, లావా దేవిల గురించి చెప్పకుండా నన్ను బెదిరిస్తున్నాడని కర్నూలుకు చెందిన ప్రవీణ్ కుమార్ రెడ్డి ఫిర్యాదు చేశారు. ప్లాట్ ఆక్రమించుకోవడానికి కొంతమంది వ్యక్తులు దౌర్జన్యం చేసున్నారని చర్యలు తీసుకోవాలని కర్నూలుకు చెందిన అంబుబాయి ఫిర్యాదు చేశారు. మా పొలాలలో పండించిన జొన్న, పత్తి పంటలను పందులు నాశనం చేస్తున్నాయని పందుల యజమానుల పై చర్యలు తీసుకోవాలని సి.బెళగల్ మండలంకు చెందిన దానియేలు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి ఒక వ్యక్తి డబ్బులు తీసుకొని మోసం చేశాడని ఎమ్మిగనూరు టౌన్ కు చెందిన అబ్దుల్ ఫిర్యాదు చేశారు. ఇసుక, గ్రావెల్ భాగస్వామి వ్యాపారం చేద్దామని చెప్పి కొందరు వ్యక్తులు నమ్మించి నా దగ్గర డబ్బులు తీసుకొని మోసం చేశారని కర్నూలుకు చెందిన వెంకటేశ్వర రెడ్డి ఫిర్యాదు చేశారు. వచ్చిన ఫిర్యాదులపై స్పందించిన ఎస్‌పి చట్టపరంగా విచారణ జరిపి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్‌పి అడ్మిన్ డి.ప్రసాద్, డిఎస్‌పిలు వెంకటాద్రి, నాగభూషణం, లీగల్ అడ్వైజర్ మల్లికార్జున రావు పాల్గొన్నారు.

పుల్లయ్య భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళ్లు అర్పిస్తున్న గౌస్ దేశాయి , తదితరులు

హమాలి కార్మికుడు పుల్లయ్య కుటుంబాన్ని ఆదుకోవాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

హమాలి కార్మికుడు డి.పుల్లయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు డి గౌస్ దేశాయ్ కోరారు. బుధవారు పేటలో కాపురం ఉంటున్న కోత హమాలి కార్మికుడు కార్మికుడు భంగి పుల్లయ్య గుండెపోటుతో మరణించారు. సోమవారం ఆయన మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. వారి కుటుంబానికి కోతహమాలి యూనియన్ తరపున మట్టి ఖర్చులకు ఇచ్చారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.గౌస్ దేశాయ్, మార్కెట్ యార్డ్ హమాలీ యూనియన్ గౌరవ అధ్యక్షుడు టి.రాముడు మాట్లాడారు. కర్నూలు నగరంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో 1000 మందికి పైగా వివిధ రకాల లైసెన్స్ హమాలి కార్మికులు పనిచేస్తున్నారని, వీరు తరచుగా ప్రమాదాలు జరిగి, దుమ్ముకు దూళికి ఆరోగ్యాలు పాడై చనిపోతున్న వీరి కుటుంబాలను ఆదుకునేందుకు వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ, ప్రభుత్వం ఎలాంటి ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించకపోవడం దారుణమన్నారు. మార్కెట్ యార్డ్ పాలకమండలి తక్షణమే అమాలీ కార్మికులకు రూ.10 లక్షల ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. చనిపోయిన హమాలి బంగిపుల్లయ్య కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. హమాలి కార్మికులకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించకపోతే కార్మికులందరిని కూడగట్టి పోరాటానికి దిగవలసి వస్తుందని హెచ్చరించారు. సిఐటియు నగర నాయకులు ఎం .రాజశేఖర్. రామకృష్ణ, కోతమాలి యూనియన్ కార్యదర్శి పి.రంగస్వామి, పి.పరశురాముడు. ఎస్.వలి, బి .వెంకట స్వామి. కె.వెంకటేశ్వర్లు, పి.నాగరాజు, పి.వెంకటేశ్వర్లు, ఎం, వెంకటస్వామి పాల్గొన్నారు.

విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేస్తున్నప్రిన్సిపల్ డాక్టర్ కళావతి

ప్రభుత్వ పురుషుల కళాశాల విద్యార్థులు ప్రతిభ

ప్రజాశక్తి కర్నూలు కలెక్టరేట్

ప్రభుత్వ డిగ్రీ కళాశాల(పురుషులు), కర్నూలుకు చెందిన విద్యార్థులు పలు రాష్ట్ర , జిల్లా స్థాయి క్రీడా పోటీలలో ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాలను సాధించి ప్రతిభ కనబరుస్తున్నారు. జిల్లా , రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కళావతి అభినందనలు తెలిపారు. బిఎ ద్వితీయ సంవత్సర విద్యార్థిని చంద్రప్పగారిదేవి జనవరి 6న కర్నూలులో నిర్వహించిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్ లీగ్ టోర్నమెంట్‌లో 400మీ. పరుగు పందెం , లాంగ్ జంప్ లో ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పథకాలను సాధించడంతో పాటు, 4ఐ100 రిలే ఈవెంట్ లో ద్వితీయ స్థానంలో నిలిచి వ్యక్తిగత ఛాంపియన్షిప్ సాధించట్లు పేర్కొన్నారు. "డాక్టర్ త్రినాథ్ కిబ్బాక్సింగ్ అకడని అధ్యర్యంలో జనవరి 8న కర్నూలులో నిర్వహించిన జిల్లాస్థాయి కిక్ బాక్సింగ్ ఛాంపియన్షిప్స్" పోటీలలో ప్రభుత్వ కళాశాల విద్యార్థులు బి.ప్రసాద్, బి తిప్పయ్య, వి.చంద్రశేఖర్ సీనియర్‌బాయ్స్ మ్యూజికల్ ఫామ్" ఈవెంట్లో ప్రథమస్థానం సాధించారు. బి.వేణుప్రసాద్, ఎం.రవి, జె.రాంబాబు ద్వితీయస్థానంలో నిలిచినట్లు తెలిపారు. 'పాయింట్ ఫైట్' అంశంలో సీనియర్ బాయ్స్ 63 కేజీల విభాగంలో పి.వంశీ ప్రథమ స్థానం, జి. హరికళ్యాణ్ ద్వితీయ, యు.భరత్ తతీయ స్థానంలో నిలిచి కళాశాలకు వన్నె తెచ్చినట్లు ప్రిన్సిపల్ తెలుపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ఎ.సత్యనారాయణ, అధ్యాపక బృదం విద్యార్థులను అభినందించారు.

జెసిబితో మట్టిని తవ్వుతున్న దృశ్యం

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరు

- సిపిఎం జిల్లా కార్యదర్శి టి.రమేష్ కుమార్

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రమేష్ కుమార్

ప్రజాశక్తి - ఆత్మకూర్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలు పోరాటాలకు సిద్ధం కావాలని సిపిఎం జిల్లా కార్యదర్శి టి.రమేష్ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని డాక్టర్ ఏ.ధనుంజయ మీటింగ్ హాల్‌లో సిపిఎం జనరల్ బాడీ సమావేశం పట్టణ కార్యదర్శి ఏ. రణధీర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం యువశక్తిని నిర్వీర్యం చేస్తోందని అన్నారు. ప్రజల ఆస్తులను, ప్రకృతి వనరులను కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతుందని విమర్శించారు. అధికారం కోసం ప్రజల మధ్య కుల, మత అడ్డగోడలు నిర్మిస్తుందన్నారు. జిఎస్‌టి పేరుతో ప్రజల నడ్డి విరిచిందని, పెట్రోలు గ్యాస్ ధరలు రెట్టింపు చేసిందన్నారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని ప్రధాని మోడీ హామీ ఇచ్చిన రెండు లక్షల ఉద్యోగాలు కూడా ఇవ్వలేదన్నారు. రాష్ట్రానికి అన్యాయం చేసిన కేంద్ర ప్రభుత్వంతో రాష్ట్రంలోని అధికార వైసిపి ప్రభుత్వం, ప్రధాన ప్రతిపక్ష పార్టీలు అంటకాగుతుండడం సిగ్గుచేటన్నారు. విద్యారంగంలో బైజుస్ వంటి సంస్థలతో ఒప్పందాలు కార్పొరేట్ శక్తులను బలోపేతం చేయడానికేనని అన్నారు. ఆర్‌బికెలు రైతులకు భరోసా కల్పించడం లేదని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సిపిఎం ఆధ్వర్యంలో నిర్వహించే పోరాటాలకు ప్రజలు సిద్ధం కావాలని కోరారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి. యేసురత్నం, మండల కార్యదర్శి నరసింహ నాయక్, నాయకులు సంజీవ రాయుడు, మాభాష, ఎన్.స్వాములు, మంజుల, మీనాక్షమ్మ, ఏ.సురేంద్ర, డి.రామ్ నాయక్, షేక్ ఇస్మాయిల్, సద్దాం, దాసు, చిన్నయ్య, గోపాల్, శివకుమార్, ముర్తుజా, దాసమ్మ, సువర్ణమ్మ, అంబయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

బుచ్చిరెడ్డికుంటలో

మట్టి అక్రమ తవ్వకాలు

- చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం

ప్రజాశక్తి - జూపాడుబంగ్లా

జూపాడుబంగ్లా మండలం పారు మంచాల పరిధిలోని బుచ్చిరెడ్డికుంటలో అక్రమార్కులు మట్టి తవ్వకాలను యథేచ్ఛగా సాగిస్తున్నారు. బుచ్చిరెడ్డికుంటలో అధికార పార్టీలోని ఓ వర్గానికి చెందిన నాయకుడి అండదండలతో కుంటలో యథేచ్ఛగా మట్టిదోపిడీ కొనసాగుతోంది. మట్టిని కుంట నుంచి ఏకంగా జెసిబిలతో తవ్వి ట్రాక్టర్ మట్టి రూ.800 నుంచి రూ.1000 దాకా విక్రయిస్తున్నారని గ్రామస్తులు చెబుతున్నారు. ప్రతి రోజు పదుల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా మట్టిని తరలిస్తున్నారు. సమన్వయంతో ప్రకృతి సంపదను పరిరక్షించాల్సిన ఇరిగేషన్, రెవెన్యూ, యంత్రాంగం మాత్రం కళ్లకు గంతలు కట్టుకుందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రైతులకు ఉపయోగపడాల్సిన మట్టి నేడు వ్యాపారవస్తువుగా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి మట్టి దోపిడీకి అడ్డుకట్ట వేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఎవ్వరికీ అనుమతులు ఇవ్వలేదు : తహశీల్దార్

బుచ్చిరెడ్డికుంటలో మట్టి తరలించేందుకు ఎటువంటి అనుమతులు లేవని, ప్రస్తుతం తాము ఎవరికి అనుమతులివ్వలేదని తహశీల్దార్ పుల్లయ్య యాదవ్ తెలిపారు. మట్టి అక్రమ తరలింపును అడ్డుకొనేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఎటువంటి అనుమతులు తీసుకోలేదు : మైనర్ ఇరిగేషన్ ఎఇ

బుచ్చిరెడ్డి కుంటలో మట్టిని తరలించేందుకు ఎటువంటి అనుమతి తీసుకోలేదని, ఎవరైనా సరే సహించేది లేదని మైనర్ ఇరిగేషన్ ఏఈ రామ్మోహన్ రెడ్డి అన్నారు. విలేకరులు చెరవాణిలో ఎఇతో మాట్లాడగా ఆయన వారి సిబ్బందిని పంపించి మట్టి దందాను ఆక్షేపించారు.

శ్రీశైల క్షేత్రంలో

12 నుండి సంక్రాంతి బ్రహ్మోత్సవాలు

- దేవస్థానం కార్యనిర్వహణాధికారి లవన్న

మాట్లాడుతున్న ఇఒ లవన్న

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైలం క్షేత్రంలో మకర సంక్రమణాన్ని పురస్కరించుకొని ఈనెల 12 నుండి 18వ తేదీ వరకు సంక్రాంతి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయని దేవస్థానం కార్యనిర్వహణాధికారి లవన్న తెలిపారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఏడు రోజులపాటు బ్రహ్మోత్సవాలు వైభవంగా జరగనున్నాయని చెప్పారు. సంప్రదాయాన్ని అనుసరించి క్షేత్రంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్లకు సంవత్సరంలో రెండుసార్లు సంక్రాంతి, మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహించబడతా యని తెలిపారు. సంక్రాంతి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మొదటి రోజు 12వ తేదీ ఉదయం 9 గంటలకు యాగశాల ప్రవేశం, సాయంత్రం ఐదున్నర గంటలకు అంకురార్పణ, అగ్ని ప్రతిష్టాపన, రాత్రి 7 గంటలకు ధ్వజారోహణ ధ్వజపతాకావిష్కరణ కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. 13వ తేదీ నుండి 18వ తేదీ వరకు ప్రతిరోజు వాహన సేవలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని చెప్పారు. 12న ధ్వజారోహణ, 13న భృంగి వాహన సేవ, 14న రావణ వాహన సేవ, 15న నంది వాహన సేవ, స్వామి అమ్మ వార్లకు కళ్యాణోత్సవం, 16న కైలాస వాహన సేవ, 17న పూర్ణాహుతి, త్రిశూల స్నానం, నాగవల్లి ధ్వజావరోహణ, 18న అశ్వవాహన సేవ, పుష్ప ఉత్సవం, శయనోత్సవాలు జరుగుతాయని తెలిపారు.

ఆర్జిత సేవలు నిలుపుదల : సంక్రాంతి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈ నెల 12 నుండి 18వ తేదీ వరకు ఆర్జిత, పరోక్ష, ప్రత్యక్ష సేవా కార్యక్రమాలు నిలుపుదల చేసినట్లు ఇఒ తెలిపారు.

సామూహిక భోగి పండ్లు కార్యక్రమం : సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని భోగి పండుగ రోజున ఆలయ ప్రాంగణంలోని అక్కమహాదేవి అలంకార మండపంలో ఐదు సంవత్సరాలలోపు పిల్లలకు సామూహిక భోగి పండ్లు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొనదలచిన వారు ఈ నెల 13వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోపు ప్రచురణ కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. అలాగే ఆలయ మాడవీధుల్లో ఈ నెల 15న ముగ్గుల పోటీలు ఉంటాయని, పాల్గొనదలచిన వారు 14వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు ప్రచురణ భాగంలో పేర్లు నమోదు చేసుకోవాల్సిందిగా సూచించారు. 17వ తేదీన వేద శ్రవణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. బ్రహ్మోత్సవాలలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి అమ్మవార్లను దర్శించుకోవాలని కోరారు.

బకాయిలు మంజూరు చేయాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి - నంద్యాల

ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంవత్సరం పైగా పెండింగ్‌లో ఉన్న సరెండర్ లీవు బకాయిలు, 2022 మార్చ్ నుంచి పిఎఫ్, ఏపిజిఎల్ఐ లోన్లు, 2018 జూలై నుంచి డిఏలు, 2022 జనవరి నుంచి రావాల్సిన రెండు విడుతలు డిఏలు వెంటనే మంజూరు చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్. నాగమణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం నంద్యాలలోని యుటిఎఫ్ కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షుడు పివి ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి నాగమణి మాట్లాడుతూ ఆర్థిక బకాయిలు ఇంత సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న పరిస్థితి గతంలో ఎన్నడూ లేదన్నారు.ఉద్యోగ ఉపాధ్యాయులు తీవ్ర నిరాశ, నిస్పృహలతో వున్నారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బకాయిలు వెంటనే మంజూరు చేయాలని కోరారు. ఆరోగ్య సంబంధ వైద్య ఖర్చుల నిమిత్తం, పిల్లల పెళ్ళిళ్ల తదితర కార్యక్రమాలు, ఇంటి అవసరాలు, గృహ నిర్మాణానికి దాచుకున్న డబ్బు సమయానికి అందక అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించక పోతే పోరాటాలకు వెనుకాడబోమని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సమావేశంలో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జె.సుధాకర్, జిల్లా సహాధ్యక్షుడు జాకీర్ హుస్సేన్, కార్యదర్శులు సత్య ప్రకాశం, రామ్ మోహన్, బాబా ఫక్రుద్దీన్, నాగ స్వామి నాయక్, కిషోర్, రామ కృష్ణుడు, బాలాజీ రావు, ఆడిట్ కమిటీ సభ్యులు దస్తగిరి, షంశుర్, వివిధ మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, జిల్లా కౌన్సిలర్లు పాల్గొన్నారు.

సమావేశం లో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి నాగమణి

ప్రతి ఒక్కరూ విద్య, క్రీడా రంగాల్లో రాణించాలి

- మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి

ప్రజాశక్తి - ఆత్మకూర్

ప్రతి ఒక్కరూ విద్య, క్రీడా రంగాల్లో రాణించాలని శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఘనంగా శ్రీశైలం నియోజకవర్గస్థాయి బుడ్డా వెంగళ రెడ్డి మెమోరియల్ ట్రోఫీ క్రికెట్ పోటీలు శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే సహకారంతో ప్రారంభం అయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి హాజరై పోటీలను ప్రారంభించారు. అంతకుముందు జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. పోటీలను క్రీడాస్ఫూర్తితో చూడాలన్నారు. గెలుపోటములు సహజమని, గెలుపు కోసం వంద శాతం ప్రయత్నించాలన్నారు. శ్రీశైలం నియోజకవర్గంలో క్రీడాభివృద్ధికి ఎప్పుడూ ముందుంటానని పేర్కొన్నారు. అనంతరం ఆయన టాస్ వేసి ముందుగా బ్యాటింగ్ చేసి క్రీడా కారుల్లో ఉత్సాహం నింపారు. అంతకుముందు క్రీడా వాలంటరీలకు దుస్తులు పంపిణీ చేశారు. క్రీడా పోటీల్లో 24 జట్లు తలపడనున్నాయని, గెలుపొందిన వారికి రూ:50వేలు, రన్నర్స్‌కు రూ. 25 వేలతో పాటు ప్రతి జట్టుకు మెమొంటోను బహుమతి దాత శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి అందజేస్తారని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు బన్నూరు రామ లింగారెడ్డి, శివ రామిరెడ్డి, కంచర్ల సురేష్, అన్నారపు శేషరెడ్డి, మల్లేశ్వర రెడ్డి, వేణు గోపాల్, శ్రీధర్ రెడ్డి, అబ్దుల్లాపూరం బాషా, కలాం, రాజా రెడ్డి, తిరుపతయ్య, మల్లికార్జున రెడ్డి, రామ్మూర్తి, నిర్వాహకులు ఎన్ఎస్.మున్నా, హజరత్ అలి, రాఘవ,కరీం, జావిద్ లతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

క్రికెట్ ఆడి పోటీలను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి

ఎంపికైన క్రీడాకారులను అభినందిస్తున్న దృశ్యం

జాతీయ పోటీలకు కొత్తపల్లి క్రీడాకారుడు

ప్రజాశక్తి - కొత్తపల్లి

జాతీయస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు కొత్తపల్లి క్రీడాకారుడు ఎన్.రవి ఎంపికైనట్లు జిల్లా సాఫ్ట్ బాల్ సంఘం కార్యదర్శి కొమ్ముువారి విజయ్ తెలిపారు. ఆదివారం కొత్తపల్లిలో క్రీడాకారుడు ఎన్.రవిని పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు అభినందించారు. ఈ సందర్భంగా కొమ్మువారి విజయ్ మాట్లాడుతూ ఒరిస్సా రాష్ట్రంలోని పూరిలో ఫిబ్రవరి 5 నుంచి 9 వరకు జరిగే 44వ జాతీయ స్థాయి సీనియర్ బాల బాలికల ఛాంపియన్ షిప్ పోటీలకు జిల్లాకు చెందిన ఇద్దరు క్రీడాకారులు కె.కల్యాణి, ఎన్.రవి ఎంపిక అయ్యారని చెప్పారు. 2022 జూన్ 30 నుంచి జులైలో శ్రీకాకుళంలో జరిగిన 9 వ రాష్ట్ర స్థాయి సీనియర్ సాఫ్ట్ బాల్ ఛాంపియన్షిప్ పోటీల్లో మంచి ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపికయ్యారని తెలిపారు. జాతీయస్థాయిలోనూ రాణించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అభినందన కార్యక్రమంలో సాఫ్ట్ బాల్ సంఘం అడ్వైజర్ జాకీర్, జిల్లా కార్యదర్శి విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇష్టారాజ్యంగా 'అల్ట్రాటెక్' యాజమాన్యం

- సిపిఎం మండలం కార్యదర్శి పి దావీదు

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

మాట్లాడుతున్న దావీదు

మండలంలో పరిధిలోని అల్ట్రాటెక్ సిమెంట్ పరిశ్రమ యాజమాన్యం ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండాపోయిందని సిపిఎం మండల కార్యదర్శి పి.దావీదు అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మండలలోని అంకిరెడ్డిపల్లి, తుమ్మలపెంట, బందర్ల పల్లె గ్రామాల ప్రజలు అల్ట్రాటెక్ సిమెంట్ పరిశ్రమ నుంచి వచ్చే దుమ్ము ధూళి వాయు కాలుష్యం వల్ల చాలా ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. అంటు రోగాలు, శ్వాసకోశ వ్యాధుల బారిన పడుతున్నారని తెలిపారు. అల్ట్రాటెక్ యాజమాన్యం మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. పరిశ్రమ యాజమాన్యం పద్ధతి మార్చుకోకపోతే ప్రజల ఆగ్రహం చవిచూడాల్సి వస్తుందని హెచ్చరించారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడితే చూస్తూ ఊరుకునేది లేదన్నారు.

ఎపిడబ్ల్యుజెఎఫ్ ఆళ్లగడ్డ నియోజకవర్గ కమిటీ ఎన్నిక

- అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా శ్రీనివాసులు, మల్లికార్జున రెడ్డి

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

పట్టణంలోని అనంత కళాశాలలో ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (ఏపిడబ్ల్యుజెఎఫ్) ఆళ్లగడ్డ నియోజకవర్గ నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా నిజాముద్దీన్, అధ్యక్షులుగా శ్రీనివాసులు, ఉపాధ్యక్షులుగా నాగయ్య, కేశవ, సుబ్బారావు, ప్రధాన కార్యదర్శిగా మల్లికార్జున రెడ్డి, సహాయ కార్యదర్శులుగా నరసింహులు, గురుశంకర్, భాస్కర్, ట్రెజరర్‌గా నాగరాజు, కార్యవర్గ సభ్యులుగా హనీఫ్, టివిఎస్‌వి ప్రసాద్, భాష, దాసు, మహబూబ్ బాషా, సాగర్ రెడ్డి, మోహన్, జయగోపాల్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గోరంట్లప్ప, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మౌలాలి మాట్లాడారు. ప్రజలకు, ప్రభుత్వానికి వారధులుగా పని చేసే జర్నలిస్టుల సమస్యలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించాలన్నారు. అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల పట్టాలు ఇచ్చి, పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులకు వేజ్ బోర్డును అమలు చేయాలని, కనీస వేతనాన్ని కల్పించి, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. జర్నలిస్టుల పిల్లలకు విద్యలో 80 శాతం రాయితీ ఇవ్వాలన్నారు. జర్నలిస్టుల హక్కుల కోసం ఎపి వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ రాజీలేని పోరాటం చేస్తోందన్నారు. అర్హులైన జర్నలిస్టులందరికీ జిఎస్టితో సంబంధం లేకుండా అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రజాశక్తి డెస్క్ ఇన్‌ఛార్జి పి.చంద్రయ్య, ఏపిడబ్ల్యూజెఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు మద్దయ్య యాదవ్, కర్నూలు సిటీ కార్యదర్శి నాగేంద్ర, నంద్యాల నియోజకవర్గ అధ్యక్షులు శివ కుమార్, ప్రధాన కార్యదర్శి జగన్, బనగానపల్లె నియోజకవర్గ ఉపాధ్యక్షులు రామచంద్రారెడ్డి, నరసింహారెడ్డి, జవహార్ ,కార్యదర్శి షాషావలితో పాటు వివిధ పత్రికల విలేకరులు పాల్గొన్నారు.

ఎపిడబ్ల్యుజెఎఫ్ ఆళ్లగడ్డ నియోజకవర్గ నూతన కమిటీ సభ్యులతో రాష్ట్ర, జిల్లా నాయకులు

మార్పు బాలకృష్ణమ్మ ఆశయ సాధనకు కృషి : ఎపిటిఎఫ్

ప్రజాశక్తి - బనగానపల్లె

ఉద్యమ పితామహుడు, పోరాట యోధుడు ఏపిటిఎఫ్ 1938 వ్యవస్థాపకులు మార్పు బాలకృష్ణమ్మ ఆశయ సాధన కోసం ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని ప్యాఫ్టో జిల్లా చైర్మన్ బి. మాధవస్వామి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని బనగానపల్లె ఏపీటీఎఫ్ డివిజన్ కార్యాలయంలో మార్పు బాలకృష్ణమ్మ 10వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల అనేక సమస్యలకు పరిష్కారం ఉద్యమాల ద్వారానే సాధించిన ఘనత మార్పు గారికి దక్కుతుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షులు ఎం.మధుసూదన్ రావు, జిల్లా ఉపాధ్యక్షులు జి. లింగమయ్య, రాష్ట్ర కౌన్సిలర్లు డి .నాగరాజు, వి. సుబ్బారాయుడు, బనగానపల్లె మండలం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జె.వెంకట కృష్ణుడు, ఇ.సుంకన్న, నాయకులు కె. రమేష్ ,పోలియ నాయక్, చాంద్ బాషా, రఫీ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు

తెలుగు సాహితీ వికాసంలో

డాక్టర్ కోడూరు ప్రభాకర్ రెడ్డి కృషి విశిష్టమైనది

- దూరదర్శన్ మాజీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఆర్.అనంత పద్మనాభ రావు

ప్రజాశక్తి - నంద్యాల

తెలుగు సాహితీ వికాసంలో డాక్టర్ కోడూరు ప్రభాకర్ రెడ్డి కృషి విశిష్టమైనదని ప్రముఖ సాహితీవేత్త మాజీ దూరదర్శన్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ అర్. అనంత పద్మనాభ రావు తెలిపారు. అజోవిబో కందాళం ఫౌండేషన్, కళారాధన సాంస్కృతిక సంస్థ నంద్యాల సంయుక్త నిర్వహణలో గత మూడు రోజులుగా నంద్యాల మున్సిపల్ టౌన్ హాల్లో జరుగుతున్న రాష్ట్రస్థాయి సాహితీ నాటక ఉత్సవాలలో భాగంగా ఆదివారం ఉదయం ప్రతిభా మూర్తి జీవితకాల సాధన పురస్కారం అందుకోబోతున్న కడపకు చెందిన ప్రముఖ సాహితీవేత్త కోడూరు ప్రభాకర్ రెడ్డి సాహితీ కృషి సమాలోచన సదస్సు నిర్వహించారు. సదస్సులో కోడూరు ప్రభాకర్ రెడ్డి సాహిత్యంపై విశ్లేషించారు. డాక్టర్ కోడూరు ప్రభాకర్ రెడ్డి రచించిన శృంగార తిలకం కావ్యంపై డాక్టర్ దీవి హైయగ్రీవాచారి, బాలసాహిత్యంపై డాక్టర్ తుమ్మలపల్లి వాణికుమారి, రచనలలో ప్రేమ తత్వంపై జొన్నవిత్తుల రామచంద్రమూర్తి, పల్నాటి భారతంపై డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి, రేనాటి పలుకుబడులపై డాక్టర్ చింతకుంట శివారెడ్డి, ద్రౌపదిపై డాక్టర్ కురుమేటి కిషోర్ కుమార్ ప్రసంగించారు. సాహితీ జీవితంపై ప్రచురించిన ప్రతిభ వైజయంతి పుస్తకాన్ని ఫౌండేషన్ వ్యవస్థాపకులు అప్పా జోస్యుల సత్యనారాయణ ఆవిష్కరించారు. ఫౌండేషన్ వ్యవస్థాపకులు అప్పా జోస్యుల సత్యనారాయణ, కళారాధన ప్రధాన కార్యదర్శి డాక్టర్ రవి కృష్ణ, కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్ఆర్ ఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అప్పా జోస్యుల సత్యనారాయణ

డాక్టర్ కోడూరు ప్రభాకర్ రెడ్డి కి ప్రతిభా మూర్తి జీవితకాల సాధన పురస్కార ప్రదానం

అజో విభో కందాళం ఫౌండేషన్ తరపున డాక్టర్ కోడూరు ప్రభాకర్ రెడ్డికి మాజీ ఉపసభాపతి మండలి బుద్ధ ప్రసాద్ ప్రతిభామూర్తి జీవితకాల సాధన పురస్కారం, లక్ష రూపాయల నగదు బహుమతి అందించి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మండలి బుద్ధ ప్రసాద్ మాట్లాడుతూ అజో విభో కందాళం ఫౌండేషన్ గత 30 సంవత్సరాలుగా తెలుగు భాష ఉన్నతికి, సాహితీ వికాసానికి చేస్తున్న కృషి చారిత్రాత్మకమన్నారు. కళారాధన నంద్యాలలో కళా వికాసానికి చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు.

మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డిని, మాజీ ఎంపిపి అంబాల రామకృష్ణారెడ్డిలను సన్మానిస్తున్న బీసీ సెల్ నాయకులు

మాజీ ఎమ్మెల్యే బిసి జనార్దన్ రెడ్డికి సన్మానం

ప్రజాశక్తి - బనగానపల్లె

పట్టణంలోని టిడిపి కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి, మాజీ ఎంపీపీ అంబాల రామకృష్ణారెడ్డిలను బిసి సెల్ నాయకులు ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా టిడిపి బిసి సెల్ నియోజకవర్గ అధ్యక్షులు పలుకూరు వల్లెపు శంకర్ మాట్లాడుతూ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర అధ్యక్షులు అచ్చం నాయుడు, బిసి సెల్ రాష్ట్ర అధ్యక్షులు మాజీ మంత్రి మాజీ కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డిలు బనగానపల్లె నియోజకవర్గం బిసి సెల్ అధ్యక్షుడిగా తనను నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. టిడిపి పాలనలోనే బిసిల అభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు చల్లా మద్దిలేటి, టిడిపి నాయకులు, కార్యకం ్తలు పాల్గొన్నారు.

నేడు స్పందన కార్యక్రమం

నంద్యాల కలెక్టరేట్ : నంద్యాల పట్టణంలోని వైఎస్సార్ సెంటినరీ హాలులో నేడు స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ మనజీర్ జిలాని సామూన్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల, నియోజకవర్గ, డివిజన్ స్థాయిలో కూడా యథాతథంగా స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

అంగన్‌వాడీ ఆయా పోస్టులకు దరఖాస్తులు

కొలిమిగుండ్ల : మండలంలోని ఆయా గ్రామాలలో అంగన్వాడీ ఆయా 4 పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐసిడిఎస్ సూపర్వైజర్ శ్రీవాణి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడి తుమ్మలపెంట (బీసీ-ఏ), కోరుమాను పల్లె (బీసీ-డి) అబ్దుల్లాపురం (ఓసి), హనుమంత గుండం (బిసి-బి) కేటాయించారని, 7వ తరగతి ఉత్తీర్ణత సాధించి 21 నుంచి 35 సంవత్సరాల లోపు వయస్సు, గ్రామ నివాసిగా, వివాహితులై ఉండాలన్నారు. ఈనెల10వ తేదీలోపు పూర్తి చేసిన దరఖాస్తులను ఓవెలకుంట్ల ఐసిడిఎస్ కార్యాలయంలో అందజేయాలన్నారు.

నాటు సారా తయారు చేసినా, అమ్మినా కఠిన చర్యలు : ఎస్ఐ

అవుకు : అవుకు మండలంలో నాటు సారా తయారు చేసినా, అమ్మినా కఠిన చర్యలు తప్పవని ఎస్సై జగదీశ్వర్ రెడ్డి హెచ్చరించారు. ఆదివారం మండలంలోని కొండమనాయుని పల్లె గ్రామ పరిసరాల్లో ఉన్న కొండలలో నాటుసారా బట్టీలు ఉన్నాయన్న సమాచారం మేరకు తనిఖీలు చేపట్టారు. ఎస్ఐ మాట్లాడుతూ గ్రామాల్లో నాటు సారా తయారీపై నిరంతరం నిఘా ఉంటుందని తెలిపారు.

ఇదేం కర్మ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

నంద్యాలతో మా అనుబంధాన్ని ఎవరూ విడదీయలేరు

- నంద్యాలను అభివృద్ధి చేసిన ఘనత భూమా నాగిరెడ్డిదే
- మాజీమంత్రి అఖిల ప్రియ, యువనేత జగత్
- భూమా అభిమానులకు పోలీసులకు మధ్య వాగ్వివాదం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాలతో మా అనుబంధాన్ని ఎవరూ విడదీయలేరని, నంద్యాలను అభివృద్ధి చేసిన ఘనత భూమా నాగిరెడ్డిదే అని మాజీ మంత్రి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి భూమా అఖిలప్రియ, యువనేత భూమా జగత్ విఖ్యాత్ రెడ్డిలు పేర్కొన్నారు. దివంగత నేత భూమా నాగిరెడ్డి జయంతి సందర్భంగా బొమ్మలసత్రం నుంచి బైకు ర్యాలీగా బయలుదేరి పద్మావతినగర్‌లోని భూమా నాగిరెడ్డి స్థలం వద్దకు చేరుకొని అభిమానుల మధ్య కేక్ కట్ చేశారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. భూమా అఖిలప్రియ, భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి స్వయంగా రక్తదానం చేశారు. అనంతరం తోపుడుబండ్ల వ్యాపారం చేసుకునే వారికి ఉచితంగా తోపుడు బండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమానికి వచ్చిన నాయకులు, కార్యకర్తలకు భోజనాలు ఏర్పాటు చేసి భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి, భార్గవ్ రామ్‌లు వడ్డించారు. అనంతరం భూమా విఖ్యాత్ రెడ్డి, అఖిలప్రియలు మాట్లాడుతూ అప్పట్లో పదివేల ఇల్లు కట్టిస్తానంటే ఎద్దేవా చేసిన వారే నేడు ఇళ్లను పంపిణీ చేస్తున్నారని తెలిపారు. నంద్యాలలో నాగిరెడ్డి చేసిన అభివృద్ధి కార్యక్రమాలే నిలిచాయని, పదివేల ఇల్లు, రోడ్ల వెడల్పు, అమృత్ స్కీం కింద నీటి సరఫరా తదితర అభివృద్ధి పనులు చేసిన ఘనత భూమా నాగిరెడ్డికే దక్కుతుందని, ఆయన వారసులుగా తాను, జగత్ విఖ్యాత్ రెడ్డి నంద్యాల కార్యకర్తలకు, నాయకులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామన్నారు. తాము ఇక్కడే ఇల్లు నిర్మిస్తున్నామని, ఇక్కడే నివాసముంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అఖిలప్రియ, జగత్ విఖ్యాత్‌రెడ్డిలకు స్వాగతం పలుకుతున్న నాయకులు

పోలీసులతో స్వల్ప వాగ్వివాదం

నంద్యాల బొమ్మలసత్రం నుండి పద్మావతి నగర్ వరకు ర్యాలీ నిర్వహించేందుకు భూమా అభిమానులు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు భూమా అభిమానులకు స్వల్ప వాగ్వివాదం జరిగింది.

బాబాయ్ ఆశయ సాధనకు కృషి చేస్తా : భూమా బ్రహ్మానందరెడ్డి

నంద్యాల పట్టణాన్ని బాబాయ్ ఎంతో అభివృద్ధి చేశారని, ఆయన ఆశయ సాధనకు కృషి చేస్తానని, అభిమానులకు, కార్యకర్తలకు అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి అన్నారు. దివంగత ఎమ్మెల్యే భూమా నాగిరెడ్డి 59వ జయంతి వేడుకలను పట్టణంలోని తులసివనంలో మాజీ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఘనంగా జరిపారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ లర్పించారు. అనంతరం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు రక్తదాన శిబిరంలో రక్తదానం చేశారు. టిడిపి నాయకులు, కౌన్సిలర్లు, వేలాదిమంది కార్యకర్తలు, నేతలు, మాజీ కౌన్సిలర్లు, పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే

జీవో నెంబర్ 1ని ఉపసంహరించుకోవాలి : టిడిపి

ప్రజాశక్తి - బేతంచెర్ల

ప్రజాస్వామ్యాన్ని కాలరాసే విధంగా వైసిపి ప్రభుత్వం అమలు చేసిన జీవో నెంబర్ 1ని తక్షణమే ఉపసంహరించుకోవాలని టిడిపి డోన్ నియోజకవర్గ ఇన్చార్జి ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి, పట్టణ కార్యదర్శి షేక్షావలి చౌదరి డిమాండ్ చేశారు. తెలుగుదేశం పార్టీ తలపెట్టిన ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం బేతంచెర్ల పట్టణంలోని అంగళ్ళ బజారు, గౌరిపేట కాలనీలలో మండల నాయకులు తిరుమలేష్ చౌదరి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో తుగ్లక్‌ను మించిన పరిపాలన కొనసాగుతుందని, జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం జీవో నెంబర్ 1విడుదల చేయడమే అందుకు నిదర్శనమన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికలలో వైసిపి ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెబుతారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు నాగేశ్వర్ రెడ్డి, రమేష్ రెడ్డి, భీమారెడ్డి, కానాల అంజి, రామ్మూర్తి, రామకృష్ణ, రాముడు, శివ, మద్దిలేటి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయినిలకు ఘనంగా సన్మానం

ప్రజాశక్తి - నంద్యాల

ఆధునిక భారత తొలి ముస్లిం ఉపాధ్యాయురాలు ఫాతిమా షేక్ స్ఫూర్తిగా ఆమె 192వ జన్మదినం పురస్కరించుకుని జమాఅతె ఇస్లామీ, మహిళా విభాగం ఆధ్వర్యంలో ఆదివారం ముగ్గురు మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. నంద్యాల చాంద్ బాడాలోని జమాత్ కార్యాలయంలో మహిళా విభాగం కన్వీనర్ బేగం అమ్తుస్సలామ్ అధ్యక్షతన అమ్తుస్సలామ్ మాట్లాడారు. జమాఅతె ఇస్లామి గత 75 వసంతాలుగా దేశంలో మత సామరస్యానికి, దేశ వాసుల మధ్య ఐక్యత కోసం పలు విధాలుగా శ్రమిస్తు విద్యాభివృద్ధికి, మహిళాభ్యున్యోతికి యనలేని కృషి చేస్తుందన్నారు. అనంతరం ఫాతిమా షేక్ స్ఫూర్తిగా ముగ్గురు మహిళా ఉపాధ్యాయులు నూర్జహాన్, నజీరున్నిసా, హిల్డా సిసిలియాలను శాలువా కప్పి, మెమోంటోతో ఘనంగా సన్మానించారు. ఫిర్దోస్ బాను, ఫాతిమా షేక్ జీవిత విశేషాలు, విద్యా ఆవశ్యకత వివరించారు.

13న వడ్డేమాన్‌లో ముగ్గుల పోటీలు

.ప్రజాశక్తి - నందికొట్కూరు

నందికొట్కూరు మండలం అల్లూరు, కొనేటమ్మ పల్లె, వడ్డేమాన్ గ్రామీణ మహిళలకు ఏఐవిఎఫ్ నేషనల్ చారిటీ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 13న సంక్రాంతి ముగ్గుల పోటీలను నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ వ్యవస్థాపకులు కె.రాజేశ్వరి దేవి, చైర్మన్ జి.నాగముని ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ముగ్గుల పోటీలలో పాల్గొనే మహిళలు రూ.20లు ఎంట్రీ ఫిజ్ చెల్లించి ముందుగానే పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు.

నేడు ఓంకారంలో అంగళ్లకు వేలం పాట

బండి ఆత్మకూర్

ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఓంకార సిద్దేశ్వర స్వామి ఆలయంలోని పరిసరాలలో వ్యాపార అంగళ్లు పెట్టుకునేందుకు నేడు వేలంపాటలు నిర్వహిస్తున్నట్లు ఈవో మోహన్, ఆలయ చైర్మన్ ఏ విశ్వనాథరెడ్డి తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ ఆలయ పరిసరాల్లో ఐస్ క్రీమ్ బండ్లు, పాదరక్షలు, టెంకాయ, పూజా సామాగ్రి తదితర వస్తువులను అమ్ముకునేందుకు వేలం పాటలు నిర్వహిస్తున్నామన్నారు. వేలంలో పాల్గొనేవారు రూ. 10 వేలు డిపాజిట్ చెల్లించాలని, అనివార్య కారణాలు ఏర్పడితే వేలంపాట రద్దు చేయవచ్చని తెలిపారు. వేలంపాట ధరలు ఒక సంవత్సరం కాలం పరిమితి ఉంటుందని పేర్కొన్నారు.

పట్టుబడిన వాహనాలకు 10న వేలం

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ఆళ్లగడ్డ సబ్ డివిజన్ పరిధిలో పలు మద్యం (ఎక్సైజ్,సారాయి) కేసులలో పట్టుబడిన వాహనాలకు ఆళ్లగడ్డ రూరల్ పోలీసు స్టేషన్‌లో ఈనెల 10న వేలం పాట వెయ్యనున్నట్లు డిఎస్‌పి సుధాకర్ రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఈ వేలంపాటలో వాహనం దక్కించుకున్న వారు వేలం పాట డబ్బుతో జిఎస్‌టి కూడా చెల్లించాల్సి ఉంటుందన్నారు. బైకులు 22, ఆటోలు 2, కార్లు 2 వేలం వేయనున్నట్లు తెలిపారు. ఆధార్ కార్డు, పాన్ కార్డ్ వున్నవారు మాత్రమే వేలం పాటలో పాల్గొనటానికి అర్హులన్నారు. ఇతర వివరాలకు డిఎస్‌పి కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

యువశక్తి పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - నందికొట్కూరు

నందికొట్కూరులోని జనసేన పార్టీ కార్యాలయంలో యువశక్తి పోస్టర్‌ను ఆ పార్టీ నాయకులు ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు రామన్న మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ ఇవ్వడం చేతకాక అప్పుల క్యాలెండర్ ఇచ్చిందని ఎద్దేవా చేశారు. ఈ నెల 12న శ్రీకాకుళంలో జరిగే యువశక్తి భారీ బహిరంగ సభకు యువతీ యువకులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

అంబేద్కర్‌ను అవమానించిన వారిని శిక్షించాలి : బిఎస్‌పి, సిపిఐ

నందికొట్కూరు : అంబేద్కర్‌ను అవమానపరిచిన రాయలసీమ యూనివర్శిటీ సూపరింటెండెంట్ ఎండి ఇస్మాయిల్‌పై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ నమోదు చేసి కఠినంగా శిక్షించాలని బిఎస్‌పి నాయకులు లాజరు, స్వాములు, సిపిఐ నాయకులు రమేష్ బాబు, రఘురాంమూర్తి డిమాండ్ చేశారు. ఆదివారం నందికొట్కూరు పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్‌లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉన్నతమైన హోదాలో ఉండి మద్యం మత్తులో తన తోటి విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసరావుతో అంబేద్కర్‌ను, దళితులను కించపరిచి మాట్లాడడం తగదన్నారు. ఎండి ఇస్మాయిల్‌ను, శ్రీనివాసరావును తక్షణమే ఉద్యోగం నుండి తొలగించి, అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ప్రసాద్, పుల్లయ్య, చిన్న రత్నం, దావీదు, జాన్, రాజేష్, శ్రీను, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేరుస్తామని ఎప్పుడైనా ప్రకటన రావచ్చు

- వాల్మీకి పోరాట సమితి జిల్లా అధ్యక్షులు గోవిందు నాయుడు

కొలిమిగుండ్ల : వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేరుస్తామని ఎప్పుడైనా ప్రకటన రావచ్చని వాల్మీకి పోరాట సమితి నంద్యాల జిల్లా అధ్యక్షులు గోవిందు నాయుడు పేర్కొన్నారు. ఆదివారం కొలిమిగుండ్లలోని సాయి ఫంక్షన్ హాల్‌లో సంఘం అధ్యక్షునిగా కొలిమిగుండ్ల ఉలవల నరసింహుడు ప్రమాణ స్వీకారం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా జిల్లా అధ్యక్షులు గోవింద నాయుడు, మాజీ మండలాధ్యక్షుడు టిసి వెంకటరాముడు, నాయకులు మాజీ సర్పంచి సీతారామయ్య, మాజీ ఎంపిటిసి చంద్రశేఖర్, డాక్టర్ కిరణ్ కుమార్, రామకృష్ణా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు మెడగట్టు రామాంజనేయులు, గొరివిమానిపల్లె సర్పంచ్ రామాంజనేయులు, ఎంకె నాయుడు, కంబగిరి రాముడు, జడలమ్మ గారి మాజీ సర్పంచ్ నాగరాజు, వెంకటేష్, రంగన్న, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా నదిపై బ్రిడ్జి, బ్యారేజీ నిర్మించాలి

- 28న 'చలో సిద్దేశ్వరం సంగమేశ్వరం
-మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర రెడ్డి

ప్రజాశక్తి - నందికొట్కూరు

కొత్తపల్లి మండలంలోని సంగమేశ్వరం వద్ద సోమశిల-సిద్దేశ్వరం మధ్య కృష్ణా నదిపై రూ.1,200 కోట్లతో నిర్మిస్తున్న ఐకానిక్ బ్రిడ్జికి బదులు బ్రిడ్జి కమ్ బ్యారేజీ నిర్మించాలని రాయలసీమ పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు, నందికొట్కూరు మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం నందికొట్కూరులోని ఆయన స్వగృహంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 28న చేపట్టే 'చలో సిద్దేశ్వరం సంగమేశ్వరం' కార్యక్రమంలో పాల్గొనాలని నియోజకవర్గంలోని అన్ని రాజకీయ పార్టీలు, సామాజిక సంఘాలను కోరారు. రాయలసీమ దశాబ్దాలుగా అభివృద్ధి చెందకపోవడానికి వరుసగా వచ్చిన ప్రభుత్వాల సుదీర్ఘ ద్రోహమే కారణమన్నారు. రాయలసీమ గుండా అనేక నదులు ప్రవహిస్తున్నప్పటికీ, ఈ ప్రాంతం కొంతకాలంగా మంజూరు చేయబడిన చిన్న ప్రాజెక్టులతో సంతృప్తి చెందాల్సి వచ్చిందన్నారు. సోమశిల, సిద్దేశ్వరం మధ్య కృష్ణా నదిపై ఐకాన్ వంతెన నిర్మాణం వలన ఎవరికీ లాభం లేదన్నారు. అందాల ఐకాన్ బ్రిడ్జి వద్దు, సీమ సాగు, తాగునీటి కష్టాలు తీర్చే బ్యారేజ్ కమ్ బ్రిడ్జి కావాలని సంక్రాంతి తరువాత వైసిపి నేతల చేతుల్లో మరోసారి మోసపోకుండా సీమ జిల్లాల ప్రజల్లో చైతన్యం తీసుకొస్తామని తెలిపారు. దీని కోసం స్టీరింగ్ కమిటీ ఆధ్వర్యంలో కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తున్నామని ప్రకటించారు. రాయలసీమ కరువు శాశ్వత నివారణకు కృష్ణ, తుంగభద్ర నదుల నీరు కీలకమన్నారు. ఈ రెండు నదులు కలిచేచోటు సంగమేశ్వర సమీపంలో సిద్దేశ్వరం అన్నారు. కేంద్ర ప్రభుత్వం జాతీయ రహదారుల నిర్మాణంలో భాగంగా 167 కె జాతీయ రహదారిని అటు తెలంగాణ, ఇటు ఆంధ్రప్రదేశ్‌ను కలుపుతూ సిద్దేశ్వరం సంగమేశ్వరం వద్ద తీగల వంతెన(ఐకాన్ బ్రిడ్జి) చేపడుతుందన్నారు. తీగల వంతెన(ఐకాన్ బ్రిడ్జి)బదులు బ్యారేజ్ తోపాటు వంతెనను చేపట్టితే సుమారు 70 టిఎంసిల నీరు నిలిచి అటు తెలంగాణకు, ఇటు రాయలసీమకు సాగు, తాగు నీరు అందుతుందన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో కెసి కాలువ, ముచ్చుమర్రి ఎత్తిపోతల, హంద్రీనీవా , పోతిరెడ్డిపాడు ప్రాజెక్టులకు సమృద్ధిగా సాగునీరు అందుతుందన్నారు. సమావేశంలో మాజీ జడ్పీటిసి నాగేశ్వరరావు, బిజెవైఎం నందికొట్కూరు ఇంచార్జి నాగ మద్దిలేటి, బిజెపి పట్టణ అధ్యక్షుడు గూడూరు రవికుమార్ రెడ్డి, జూపాడుబంగ్లా నాయకులు రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బైరెడ్డి రాజశేఖర రెడ్డి

మాట్లాడుతున్న నాయకులు నాగరాజు

విఆర్‌ఎలకు వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

- సిఐటియు జిల్లా కార్యదర్శి నాగరాజు

నంద్యాల : విఆర్‌ఎలకు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని సిఐటియు జిల్లా కార్యదర్శి నాగరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం జరిగిన విఆర్‌ఎల సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ విధుల్లో ఉన్న విఆర్‌ఎలు చనిపోతే వారి కుటుంబంలోని వారికి వారసత్వ హక్కు కల్పించాలని డిమాండ్ చేశారు. విఆర్‌ఎలకు వీఆర్వో ప్రమోషన్ ఇవ్వాలన్నారు. ఈ డిమాండ్లు నెరవేర్చకపోతే పెద్ద ఎత్తున పోరాటాలకైనా సిద్ధమవుతామని తెలిపారు. సమావేశంలో గౌరవాధ్యక్షులు సత్యరాజు, జిల్లా అధ్యక్షులు నాగేష్, కార్యదర్శి భూపాల్, మహేష్, రమాదేవి, వీరన్న, నారాయణ, రంగస్వామి, దామోదర్, ముత్తు మహేశ్వరమ్మ, అన్సర్ పాల్గొన్నారు.

గ్రంథాలయాలను వినియోగించుకోవాలి

కొత్తపల్లి : మండలంలోని విద్యార్థులందరూ గ్రంథాలయాలను వినియోగించుకోవాలని గ్రంథాలయ అధికారి కౌసల్య తెలిపారు. ఆదివారం కొత్తపల్లిలోని గ్రంథాలయంలో విద్యార్థులతో చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రంథాలయాల్లో ఉన్న పుస్తకాలు, పేపర్లు, ప్రముఖుల జీవిత చరిత్రలు చదివి తెలుసుకోవాలని విద్యార్థులకు సూచించారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

బనగానపల్లె : పట్టణంలోని ఎస్‌వి డిగ్రీ, జూనియర్ కళాశాలలో స్వామి వివేకానంద జయంతి సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులకు 'యువతకు స్వామి వివేకానంద సందేశం' అంశంపై వ్యాసరచన పోటీలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గురుజీ రామశేసయ్య మాట్లాడుతూ శ్రీహట్టి మునిస్వామి దేవస్థానం ప్రాంగణంలో వివేకానంద స్వామి జయంతి సందర్భంగా విద్యార్థులకు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా సలహాదారుడు దొంత వెంకటేశ్వర్లు, రిటైర్డ్ ఉపాధ్యాయుడు గుద్దేటి సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం : బిసి ఇందిరా రెడ్డి

ప్రజాశక్తి - కోవెలకుంట్ల

ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బిసి జనార్దన్ రెడ్డి సతీమణి బిసి ఇందిరా రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని రేవనూరు గ్రామంలో వెలిసిన హుస్సేన్ వలి దర్గాలో కొలిమిగుండ్ల మండలం తుమ్మలపెంట గ్రామానికి చెందిన బాయికాటి బ్రదర్స్ హుస్సేన్ వలి కుమారుడి కేశఖండన కార్యక్రమానికి ఆమె పాల్గొని పిల్లలను ఆశీర్వదించారు. కార్యక్రమంలో మండల, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

కేశఖండన మహోత్సవంలో పాల్గొన్న బిసి ఇందిరా రెడ్డి

బ్రాహ్మణ సేవా సమాఖ్య ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి- నంద్యాల రూరల్

నంద్యాలలోని ప్రథమ నంది గాయత్రి దేవాలయంలో బ్రాహ్మణ సేవా సమాఖ్య ఆధ్వర్యంలో సంక్రాంతి ముగ్గుల పోటీలు ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 35 మంది మహిళలు పోటీలో పాల్గొన్నారు. న్యాయ నిర్ణేతలుగా సీతాకుమారి, రామ్ ప్రసాద్‌లు వ్యవహరించి పది మందిని విజేతలను నిర్ణయించారు. బ్రాహ్మణ సమాఖ్య సంఘం ప్రదాన కార్యదర్శి నగర డోనా సుధీర్, నాగేంద్ర, కేశవమూర్తి, హెల్త్ సత్యనారాయణ, రేణుక, సాయి, ప్రశాంతి, శ్రీధర్, వసంధర, మల్లిక తదితరులు విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. పాల్గొన్న ప్రతి ఒక్కరికి ప్రోత్సాహక బహుమతి అందజేశారు.

విజేతలకు బహుమతులు ప్రదానం చేసిన బ్రాహ్మణ సంఘం నాయకులు

42 ఏళ్లకు కలుసుకున్న పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి - బనగానపల్లె

పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో 1978-80 ఇంటర్మీడియట్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం బివి సుబ్బారెడ్డి ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. పూర్వ విద్యార్థులు సకుటుంబ సమ్మేళనాన్ని నిర్వహించుకొని పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. 42 ఏళ్ల ఇంటర్ విద్య తర్వాత వివిధ పై చదువుల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లిన వీరంతా బివి.సుబ్బారెడ్డి ఫంక్షన్ హాల్లో కలుసుకుని సంతోషాన్ని పంచుకొన్నారు. అప్పటి ఫిజిక్స్ లెక్చరర్ ఆంజనేయులును ఘనంగా సన్మానించారు. లాయర్ టి.మాధవ రెడ్డి అధ్యక్షతన అపూర్వ సమ్మేళనాన్ని ఆంజనేయులు జ్యోతి ప్రజ్వలన చేసి సమావేశం నిర్వహించారు. అనంతరం నూతన కమిటీ అధ్యక్షులుగా మాధవ రెడ్డి, సెక్రటరీగా ఈవి.రమణ, ట్రెజరర్‌గా అక్బర్ బాషా, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎస్.టి.నాగరాజు, గౌరవ అధ్యక్షులుగా కె.హరినాథ్ రెడ్డి, భూమా తులసీశ్వర రెడ్డిలను ఎన్నుకున్నారు. మిగతా కార్యవర్గాన్ని త్వరలో పూర్తి చేస్తామని అధ్యక్షులు మాధవ రెడ్డి తెలియజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల హరినాథ రెడ్డి, ఈ.వి. రమణ, అక్బర్ బాషా, ఎస్టీ నాగరాజు, రాజశేఖర్, వేణుగోపాల్, యూసఫ్ హుస్సేన్, భూమా తులసీశ్వర రెడ్డి, సుమారు 300 మంది పూర్వ విద్యార్థు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

గురువులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని ప్రజా సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తున్నామని శాసనసభ్యులు గంగుల బ్రిజేంద్ర రెడ్డి అన్నారు. ఆదివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీలోని 9వ సచివాలయంలో విజయ మిల్క్ డైరీ చైర్మన్ ఎస్‌వి జగన్ మోహన్ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం నుండి అందిన సంక్షేమ పథకాల లబ్ధిని లబ్ధిదారులకు వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబు, కౌన్సిలర్ గొట్లూరు సుధాకర్ రెడ్డి, వైసిపి నాయకులు భాస్కర్ రెడ్డి, గోపాల్ రెడ్డి, చక్రవర్తి, రఘు, సచివాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల నుండి సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే గంగుల

ఎన్‌టిఆర్ అభిమానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి - బనగానపల్లె

భానుముక్కలకు చెందిన ఎన్టీఆర్ అభిమాని ఉస్మాన్‌కు బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచి బి.సి.రాజారెడ్డి ఆదివారం ఆర్థికసాయం అందజేశారు. ఎన్‌టిఆర్ అభిమాని, టిడిపి కార్యకర్తగా ఉన్న ఉస్మాన్ కాలుకు దెబ్బ తగిలి గత కొంత కాలంగా కూలి పనులకు సైతం వెళ్లలేక ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న మాజీ సర్పంచ్ బిసి రాజారెడ్డి ఆర్థిక సాయం అందించి, కొత్త దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బిసి రాజారెడ్డి మాట్లాడుతూ ఉస్మాన్ కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో టిడిపి ముస్లిం మైనార్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు రాయలసీమ సలాం, నాయకులు షబ్బీర్, హర్షద్, విష్ణువర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

ఫిబ్రవరి 26న ఉచిత సామూహిక వివాహాలు

ప్రజాశక్తి - నంద్యాల

నంద్యాల అంజుమన్ ఆధ్వర్యంలో పేద ముస్లిం యువతులకు ఉచిత సామూహిక వివాహం నిర్వహించి రు.40 వేలు ఇస్తున్న విషయం విదితమే. ఈ నేపథ్యంలో ఫిబ్రవరి 26వ తేదిన అంజుమన్ షాదిఖానాలో ఉచిత సామూహిక వివాహాలు నిర్వహిస్తున్నట్లు అంజుమన్ అధ్యక్షులు నశ్యం అబ్దుల్ ఖుద్దూస్ ఆదివారం తెలిపారు. ఫిబ్రవరి 18 నాటికి ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా గల అంజుమన్ షాదిఖానాలో ధరఖాస్తులు తీసుకొని పూర్తి చేసి, వధూవరుల ఆధార్, ఫోటోలు జత చేసి ఇవ్వాలన్నారు. వధువు నంద్యాలకు చెంది 18 ఏండ్లు నిండి ఉండాలని, వివాహం రోజే రూ.40 వేలు నగదు చెక్కు ఇవ్వనున్నట్లు తెలిపారు. అంజుమన్ నియమానుసారంగా సామూహిక వివాహాలకు సిద్ధమైన పేద ముస్లింలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు అబ్దుల్ హఖ్, ఏగ్బాల్, హిదాయతుల్లా, మున్నా తదితరులు పాల్గొన్నారు.

బాధిత మహిళను పరామర్శించిన మాజీ సర్పంచి బిసి

ప్రజాశక్తి - బనగానపల్లె

పాము కాటుతో అస్వస్థతకు గురై చికిత్స పొందుతున్న అవుకు మండలం చెన్నంపల్లె గ్రామానికి చెందిన బసిరెడ్డి గారి మధుసూదనరెడ్డి సతీమణి శ్రీలేఖను బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచి బిపి రాజారెడ్డి ఆదివారం కర్నూలులోని సహస్ర ఆస్పత్రిలో పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.

శ్రీలేఖను పరామర్శిస్తున్న మాజీ సర్పంచ్ బీసీ రాజా రెడ్డి

తిరుణాలకు సిద్ధమవుతున్న ఆలయాలు

ప్రజాశక్తి - పగిడ్యాల

మండలంలోని పాతకోట గ్రామంలోని ఆలయాలను సంక్రాంతి పండగను పురస్కరించుకుని తిరుణాల నిర్వహణకు ఆలయాల కమిటీ సభ్యులు ముస్తాబు చేస్తున్నారు. పడమర ప్రాతకోట గ్రామంలోని అన్నపూర్ణ కాశీవిశ్వేశ్వర స్వామి, నందేశ్వర స్వామి వార్ల అలయాలను సిద్ధం చేస్తున్నారు. ఆలయాలను నీటితో శుభ్రం చేసి రంగులు వేస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. రథోత్సవానికి రథాని సిద్ధం చేస్తున్నామన్నారు. ఈ నెల 13న బండి సేవ, 14న ప్రభ,15న రథోత్సవం,16న పారువేట, 17 వసంతోత్సంతో తిరుణాల ముగుస్తుందని కమిటీ సభ్యులు తెలిపారు.

ఆలయాన్ని నీటితో శుభ్రం చేస్తున్న దృశం

మహారాజ శ్రీ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు :
నందికొట్కూరు
O.S.No. 189/2021

బిట్వీన్ :
యస్.తేజేశ్వరప్ప తండ్రి లేటు యస్.మల్లేశ్వర ప్రసాద్, హిందువు, వయస్సు 40 సం౹౹, ల్యాండ్ లార్డ్, 19-40, సంగయ్య పేట, నందికొట్కూరు, నంద్యాల జిల్లా. ...ప్లెయింటిఫ్

వర్సెస్

బోయ వెంకటేశ్వర్లు తండ్రి పుల్లన్న, హిందువు, వయస్సు సుమారు 55 సం౹౹, కార్పెంటర్ వ్యాపారం, 22-222, వాల్మీకి నగరు, నందికొట్కూరు, నంద్యాల జిల్లా. ...డిఫెండెంట్

పై నెంబరు దావాలో ప్రతివాది అయిన మీకు ఎన్నిమార్లు ద్వావా సమన్లు పంపించియున్నను సమన్లు అమలు జరగనందున శ్రీ కోర్టు వారు పై దావాలో ప్రతివాదికి సమన్లు అమలు జరపుటకు గాను పత్రికా ముఖముగా ప్రచురణ చేయుట ద్వారా సమన్లు అమలు జరుపవలెనని ఆదేశించియున్నారు. కావున పై దావాలో ప్రతివాదికి సమన్లు అమలు జరుపుటకు శ్రీ కోర్టువారి ఉత్తర్వుల మేరకు ఈ పత్రికా ప్రచురణ జరిగినది. పై ప్రతివాది అయిన మీరు శ్రీ కోర్టు వారి ముందు హాజరు అవుటకు 07-02-2023వ తేదికి వాయిదా వేసియున్నారు. కావున పై తేదిన శ్రీ కోర్టుకు స్వయముగా గాని లేక న్యాయవాది ద్వారా గాని హాజరై తమ ఆక్షేపణలు తెలియజేసుకొనగలరు. లేని యెడల తమ పరోక్షమందు తీర్మానముచేయబడునని తెలియజేడ మైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది : 07-02-2023

టి.రఘునాథ రెడ్డి,
న్యాయవాది,
నందికొట్కూరు, నంద్యాల జిల్లా.

ఘనంగా భూమా నాగిరెడ్డి జయంతి

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

పట్టణంలో దివంగత ఎమ్మెల్యే భూమా నాగిరెడ్డి 59వ జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక శోభ ఘాట్‌లో భూమా నాగిరెడ్డి సమాధి వద్ద ఆయన చిత్రపటానికి మాజీ మంత్రి భూమా అఖిలప్రియ, భార్గవరామ్ దంపతులు, తాలుకా యువ నాయకులు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డిలు నివాళు లర్పించారు. అలాగే నంద్యాల మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి, బిజెపి తాలుకా బాధ్యులు భూమా కిషోర్ రెడ్డి నివాళులర్పించారు. వారితో పాటు కౌన్సిలర్ హుస్సేన్ భాష, టిడిపి నంద్యాల పార్లమెంటు అధికార ప్రతినిధి బంగారు రాము యాదవ్, మాజీ జెడ్పిటిసి చాంద్ బాషా, కాంట్రాక్టర్ నన్నేబాయ్ గారి జిలాన్, బ్యాంకు బాలిరెడ్డి, భూమా అభిమానులు నివాళులర్పించారు.

చాగలమర్రి : దివంగత ఎమ్మెల్యే భూమా నాగిరెడ్డి తన జీవితం ప్రజాసేవకే అంకితం చేశారని రాష్ట్ర టిడిపి మైనారిటీ సెల్ ఉపాధ్యక్షుడు ముల్లా అన్సర్‌బాష అన్నారు. చాగలమర్రిలోని మహబూబ్ థియేటర్ ఆవరణంలో భూమా నాగిరెడ్డి జయంతి సందర్భంగా భూమా చిత్రపటానికి పూలమాల వేసి, కేక్ కట్ చేసి ఘనంగా నివాళులు అర్పించారు. టిఎన్‌టియుసి రాష్ట్ర కార్యదర్శి గుత్తి నర్సింహులు, నంద్యాల పార్లమెంటరీ బిసి సెల్ స్పోక్ పర్సన్ సల్లా నాగరాజు,నంద్యాల పార్లమెంటరీ మైనార్టి నాయకులు కొలిమి హుసేన్‌వళి, షరీఫ్, ఐ టిడిపి నియోజకవర్గ ఉపాధ్యక్షురాలు శగ్నారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి హనీఫ్, ప్రచార కార్యదర్శి గఫార్, మౌళాలి, జోషఫ్, ఓబులేసు, రమేష్, భాస్కర్ రెడ్డి, నాగశేషు, గాంధీ, శ్యాబుల్, రాజేష్, బషీర్, మాబులాల్, సోను, బషీర్, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ : మండలంలోని పడియపాడు గ్రామంలో టిడిపి మండల నాయకుడు కూడా నారాయణరెడ్డి స్వగృహంలో భూమా నాగిరెడ్డి 59వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమా నాగిరెడ్డి రైతు బాంధవుడని, రైతుల కోసం ఎన్నో త్యాగాలు చేశారని తెలిపారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. టిడిపి నాయకులు, వైస్ సర్పంచ్ దస్తగిరి పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ : భూమా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

చాగలమర్రి : కేక్ కట్ చేస్తున్న టిడిపి నాయకులు